ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

WEDNUSDAY 1ST JULY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 105 COST : 3\- KHAMMAM, TELANGANA

బుధవారం 01 జూలై 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 105 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## అంటార్కిటాలో పేలిన అగ్నిపర్వతం

**బంగారం ధూళిని వెదజల్లిన లావా**

అంటార్కిటికా,జూన్ 30 సాధారణంగా అగ్నిపర్వతాలు లావా, బూడిద, విషవాయువులను వెదజల్లడం సాధారణమే. కానీ అంటార్కిటికాలోని మౌంట్ ఎరెబస్ అగ్నిపర్వతం మాత్రం బంగారాన్ని కూడా గాల్లోకి వెదజల్లుతోంది. మన భూమండలానికి పూర్తిగా దక్షిణ ప్రాంతంలో ఉన్న ఈ అగ్నిపర్వతం ప్రతిరోజూ సుమారు 80 గ్రాముల బంగారు ధూళిని వాతావరణంలోకి విడుదల చేస్తోందని శాస్త్రవేత్తలు ఎప్పుడో గుర్తించారు. దీని విలువ రోజుకు సుమారు 6,000 డాలర్లు (దాదాపు 5.67 లక్షలు). అంటే ఏడాదికి దాదాపు 22 లక్షల డాలర్లు (రూ.18.9 కోట్లకు పైగా) ఉంటుందని అంచనా. మౌంట్ ఎరెబస్ నుంచి వెలువడే బంగారం ఆవిరి రూపంలో ఉంటుంది.

# పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు



- ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు
- పదవి శాశ్వతం అని నేను కూడా భావించడం లేదు
- ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం
- రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి గాడిన పెడుతున్నాం
- రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం
- బకాసురుడు కెసిఆర్ చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం
- కెసిఆర్ హాయంలో జీతాలు కూడా సక్కగ ఇవ్వలేదు
- కన్నకూతరు ఫోన్లు క ఊడా ట్యాప్ చేసిన ఘనుడు
- మళ్ళీ వస్తే ఫోన్ ట్యాపింగ్ తప్ప మరేమీ ఉండదు
- రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదు
- శిల్పకళావేదిక సభలో సిఎం రేవంత్ విమర్శలు

హైదరాబాద్,జూన్ 30: పదవి ఎవరికీ శాశ్వతం కాదని, కేవలం ఇచ్చిన మాటే శాశ్వతంగా ఉంటుందని.. నాడు ఇందిరమ్మ, ఎన్టీఆర్ లాంటి మహానాయకులే ఓడిపోయారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నాకు కూడా అంతేనని, పదవి శాశ్వతంగా ఉంటు ందని నేను కూడా భావించడం లేద న్నారు. అయితే ఉన్నన్ని నాళ్లు మంచి పనులు చేసి, మంచి వాడనిపిం చుకో వడమే ముఖ్య మని అన్నారు. నేను అబద్దాలు చెప్పను, చెప్పింది చేసి తీరుతా. ప్రజలకు నచ్చకపోయినా ఉన్నది ఉన్నట్లే చెప్తాను అని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలది, రైతులది, ఆడబిడ్డలది అని భరోసా ఇచ్చారు. కేసీఆర్ లాంటి తప్పుడు పనులు తాను ఎప్పటికీ చేయనని చెప్తూ.. ఆ పశుపతిని (కేసీఆర్‌ను) నీ ఫార్మ్‌హౌస్‌లోనే బంధించాను, ఇక బయటకు రానిచ్చే ప్రసక్తే లేదు' అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. శిల్పకళావేదిక వేదికగా జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకుల తీరును ఎండగడుతూ పదునైన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బకాసురుడిని తీసుకెళ్లి ఫార్మ్‌హౌస్‌లో కూర్చోబెట్టారని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆయన అన్నీ మీకే చేశాడని, మళ్లీ అధికారంలోకి రావాలని అంటున్నాడు. అసలు మనకేం చేశాడు? మళ్లీ ఎందుకు వస్తాడు అని సీఎం ప్రశ్నించారు. గత పదేళ్లలో అగ్రికల్చర్, హార్టికల్చర్‌లను పూర్తిగా పక్కనపెట్టేసి, రాష్ట్రంలో 'డ్రింకింగ్ కల్చర్' తీసుకువచ్చారని మండిపడ్డారు. బకాసు9రుడు చేసిన అప్పులను మేము తీరుస్తున్నామని అన్నారు. మళ్లోసారి కేసీఆర్ వస్తే భార్యాభర్తల మాటలను వినడం తప్ప చేసేదేమీ

మిగతా 2వ పేజిలో..

## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

- హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం
- గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం...
- కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్
- అత్యాధునిక యుద్ధ విమానాల్లో 'మేడ్ ఇన్ తెలంగాణ'
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి




హైదరాబాద్,జూన్ 30 ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్-2026 అంతర్జాతీయ

మిగతా 2వ పేజిలో..

## వరంగల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా

**బీజేపీ నాయకులకు మంత్రి పొన్నం సవాల్**

మిగతా 2వ పేజిలో..

## స్కూలు బస్సుపై కూలిన చెట్టు

**11 ఏళ్ల బాలుడు మృతి..పలువురికి గాయాలు**

మిగతా 2వ పేజిలో..

## సాంస్కృతిక క్రీడా వివాదానికి అమెరికా సుప్రీం తెర

**మహిళల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్లకు చెక్**

న్యూయార్క్,జూన్ 30 : అమెరికాలో సుదీర్ఘ కాలంగా సాగుతున్న సాంస్కృతిక, క్రీడా వివాదానికి ఆ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు తెరదించింది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే మహిళల, బాలికల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్ అథ్లెట్లు పాల్గొనకుండా పలు రాష్ట్రాలు విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ తీర్పుతో రిపబ్లికన్ పార్టీ నేతృత్వంలోని ఐడహో, వెస్ట్ వర్జీనియాతో పాటు మరో రెండు డజన్లకు పైగా అమెరికా రాష్ట్రాలకు పెద్ద ఉపశమనం లభించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పుతో ఇకపై ఆయా రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లో విద్యార్థులు తమ 'లింగ గుర్తింపు' ఆధారంగా కాకుండా, పుట్టినప్పుడు నమోదైన లింగ నిర్ధారణ ఆధారంగానే క్రీడా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. అంటే, అబ్బాయిలుగా

మిగతా 2వ పేజిలో..

## 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతు భరోసా నిధుల ఎగవేత

- సభల పేరుతో నాటకాలు తప్ప రైతులకు చేసిందేమీ లేదు
- మరోమారు ఎక్స్ వేదికగా రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్,జూన్ 30 30 నెలల పాలనలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు. ఈ మేరకు

మిగతా 2వ పేజిలో..

## కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

- బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శ

హైదరాబాద్,జూన్ 30 కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

మిగతా 2వ పేజిలో..



## ఎరువుల సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం

- కావాలనే తెలంగాణపై బిజెపి కక్ష
- బిజెపి, బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం

2వ పేజిలో..

## అసోంలో భారీ ఆపరేషన్

**అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారం స్వాధీనం**

గౌహతి,జూన్ 30:అస్సాం పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.55 కోట్లకు పైనే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. బహుశా అస్సాం పోలీస్ చరిత్రలోనే ఇంతపెద్ద మొత్తంలో బంగారం సీజ్ చేసిన ఘటన ఇదే కావొచ్చని డీసీపీ శాంభవి మిశ్రా తెలిపారు. గువాహటిలో అక్షయ్ బన్సోడే (32) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టాం. 24 క్యారెట్ల బంగారు కడ్డీలతో పాటు దాదాపు 13 గ్రాముల

మిగతా 2వ పేజిలో..



## సిఎంతో హెచ్‌డిఎఫ్‌సి ప్రతినిధుల భేటీ

- సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు ప్రారంభం

మిగతా 2వ పేజిలో..

# ఎరువుల సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం

సిద్దిపేట,జూన్ 30: తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం లేదు కాబట్టి ఉద్దేశపూర్వకంగా ఎరువుల సరఫరాలను తగ్గించి ఇబ్బందులు సృష్టిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఎరువుల సరఫరా భారతీయ జనతా పార్టీ బాధ్యత అని చెప్పుకొచ్చారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఎరువుల సకాలంలో విడుదల చేయడంలో ఇద్దరు కేంద్రమంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 17, 18 వార్డుల్లో కొనసాగుతున్న సర్ ఓటర్ సవరణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎరువుల తయారీ, సరఫరా కేంద్రం పరిధిలోని అంశమన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఎరువులు తయారు చేసుకోరని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తయారు చేసే ఎరువులతో పాటుగా తెలంగాణలో ఉన్న ఎరువుల ఫర్టిలైజర్ ఫ్యాక్టరీని తెలంగాణ రాష్ట్రానికి అప్పగించాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడితే భారతీయ జనతా పార్టీ నాయకుల ఇళ్ల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎరువుల కొరత విషయంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు జాగ్రత్తగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అభివృద్ధి గిట్టని బిజెపి, బిఆర్ఎస్ నేతలు అదేపనిగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం చేసే మంచి పనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్,హరీష్ రావులు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఎవరిపైనా కక్షపూరిత చర్యలు తీసుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్లను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని బీజేపీ పగటి కలలు కంటోందని మంత్రి ఎద్దేవా చేశారు. ఆశ ఉండడంలో తప్పులేదని, కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్.. ఒకే తాను ముక్కలని విమర్శించారు. కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ల అక్రమాలపై సీబీఐ విచారణ కోరితే.. కేంద్రం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

## 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధుల ఎగవేత

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా మాజీ మంత్రి విరుచుకుపడ్డారు. మీ 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా? గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించు కుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

## అసోంలో భారీ ఆపరేషన్

బరువు ఉన్న వెండి ముక్కలు స్వాధీనం చేసుకున్నాం అని ఆమె తెలిపారు. ఈ ముఠాకు అంతర్జాతీయ గోల్డ్ స్మగ్లింగ్ ముఠాతో సంబంధం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదొక భారీ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాకు సంబంధించినదిగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. బన్సోడే గతంలో మూడుసార్లు 20 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించాడని, తాజాగా నాలుగోసారి తరలిస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు.

## స్కూలు బస్సుపై కూలిన చెట్టు

### 11 ఏళ్ల బాలుడు మృతి..పలువురికి గాయాలు

ముంబై,జూన్ 30 ముంబై నగరంలో విషాదం చోటుచేసుకుంది. ఓ పెద్ద చెట్టు స్కూల్ బస్సుపై కూలిపడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం ఓ స్కూల్ బస్సు చెంబూర్ రోడ్ నంబర్ 11లో వెళుతుండగా పెద్ద చెట్టు కూలి బస్సుపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 13 మంది విద్యార్థులు ఉన్నారు. చెట్టు బస్సుపై పడగానే బస్ కండక్టర్, స్థానికులు వేగంగా స్పందించారు. ధ్వంసం అయిన బస్సు నుంచి పిల్లలను బయటకు తీసుకువచ్చారు. గాయపడ్డ ఐదుగురిని చెన్ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు, ముంబై

ౖ÷ర్ బ్రిగేడ్‌కు సమాచారం వెళ్లింది. పోలీసులు,ౖ÷ర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలెట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ 11 ఏళ్ల విహాన్ శ్రీవాస్తవ్ అనే బాలుడు జెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మిగిలిన ఐదుగురి పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఘటన గురించి తెలియగానే ముంబై మేయర్ రీతూ తావ్‌డే జెన్ ఆస్పత్రికి వెళ్లారు. బాధితులను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రీతూ తావ్‌డే మాట్లాడుతూ.. 'ఈ సంఘటన ఎంతో బాధాకరం. నేనో తల్లిగా ఇక్కడికి వచ్చాను. పిల్లల తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆ స్కూల్ బస్సులో ప్రమాదం జరిగినపుడు 13 మంది ఉన్నారు. వారిలో 12 మంది క్షేమంగా బయటపడ్డారు. ఓ బాలుడు మృతి చెందాడు' అని తెలిపారు.

# పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు

లేదన్నారు. కన్న బిడ్డ కవిత, అల్లుడు మాట్లాడుకున్న మాటలు విన్నారని ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. 30 నెలల్లో రైతు సంక్షేమం కోసం అనేక పనులు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 19 మంది ముఖ్యమంత్రులు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లు అప్పు చేశారని, 2014 నాడు రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లే అప్పు ఉందని సీఎం గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పు అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేవలం కల్వకుంట్ల కుటుంబం ఏడు లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని సీఎం చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన టైంలో మిగులు బడ్జెట్ ఉండేదని, రాష్ట్రం కోలుకోకుండా కేసీఆర్ అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అప్పులు కాదు.. అందిన కాడ చేబదులు కేసీఆర్ తీసుకొచ్చారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ఉద్యోగులకు జీతాలు వాయిదాల్లో ఇచ్చారని బీఆర్ఎస్ పాలనను సీఎం రేవంత్ దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రంలో జీతాలు ఇవ్వలేని స్థితికి కేసీఆర్ తీసుకెళ్లారని సీఎం రేవంత్ విమర్శించారు. కాంట్రాక్టర్లు, సర్పంచులకు బకాయిలను కేసీఆర్ ఇవ్వలేదని, కేసీఆర్ సర్కార్ వల్లే మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని సీఎం ఆరోపించారు. బకాయిలు బకాసురుడు పెడితే.. కట్టే పాపం తనపై పడిందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. స్కూల్లోని పిల్లలకు మిడ్ డే మీల్స్ పెట్టేవాళ్లకు బకాయిలు పెట్టారని.. బీఆర్ఎస్ సర్కార్ అప్పులే కాదు.. తప్పులు కూడా చేసిందని సీఎం విమర్శించారు. దేశంలో ఎక్కడికి పోయినా ఇజ్జత్ పోయేలా కేసీఆర్ చేశారని, చంద్రశేఖర్ దెబ్బకు రాష్ట్రంలోని ప్రజలంతా బికారులయ్యామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తవ్వుతున్న కొద్దీ.. గుట్టల కొద్దీ అప్పులు బయటపడ్డాయని.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇదే వేదికపై నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై కూడా రేవంత్ రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోదీ, ఆ ఉద్యోగాలు ఎవరికిచ్చారని నిలదీశారు. ఇక్కడ ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయని, వారు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. 'అక్కడ పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కాబట్టి మీ పప్పులు ఉడికాయి. బెంగాల్‌లో గెలవడానికి మీకు 15 ఏళ్లు పట్టింది. కానీ ఇక్కడికి మీరా వచ్చేది? ఇక్కడ మావాళ్లు ఉన్నారు, దంచి కొడతారు' అంటూ తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. 'దిగిపోవడానికి ఇది నీ అయ్యా జాగీరా? మేము మీకేం బానిసలం కాదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు రైతులను వరి వేసుకుంటే ఉరే అన్న కేసీఆర్, ఆయన మాత్రం ఫార్మ్‌హౌస్‌లో వడ్లు పండించి ఏకంగా 4200 క్వింటాళ్లు అమ్ముకున్నాడని ఆరోపించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలినా.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బోరు కింద పంటలు పండినా కాళేశ్వరం మహిమ అంటూ ప్రజలను మోసం చేశారని చెప్పారు. కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా? దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు? పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి తాగుడు కల్చర్ నేర్పించారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే చేసేదేమీ ఉండదు. వరి వేస్తే ఉరే అని బెదిరించి రైతుల పంటను కొనలేదు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ అన్నారు.. వేశారా?ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఆయన చెప్పారు.. ఇచ్చారా? అని ప్రశ్నించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం. మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. మహిళలతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి యజమానులుగా చేశాం. రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షాలు పడ్డాయి. రైతుల వరిసాగు తగ్గించి మెట్ట పంటలు వేసుకోవాలి. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనుకునేలా చేస్తున్నాం. 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9వేల కోట్లు వేస్తాం. ఒక్కో సమస్యను చక్కబెట్టుకుంటూ సంక్షేమం కొనసాగిస్తున్నాం. సాగు పనులు మొదలయ్యే నాటికే రైతుభరోసా అందిస్తున్నాం. 2023లో సీఎస్ వంటి ఐఏఎస్ అధికారులకే 1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి. కొన్నేళ్లుగా వాయిదాల పద్ధతిలో వస్తున్నాయని అధికారులు చెప్పారు. బడి పిల్లల తిండి బిల్లులు కూడా రూ.వేల కోట్ల బకాయిలు పెట్టారు. సర్పంచ్‌ల బిల్లులు రూ.వేలకోట్లు పెండింగ్ పెడితే.. వారు ఇప్పుడు ధర్నాలు చేశారు. బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్.. ఆ బద్నాం మోసింది నేను. కేసీఆర్ చేసిన అప్పులతో ఢిల్లీలో కూడా పరువు పోయే పరిస్థితి వచ్చింది' అని రేవంత్ అన్నారు.

# కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడారు. మోదీ నేతృత్వంలో భాజపా వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. భాజపాను గెలిపించిన రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పశ్చిమబెంగాల్‌లో ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. భాజపా కార్యకర్తల కష్టాలతో పశ్చిమబెంగాల్‌లో గెలిచామని చెప్పాను. అక్కడ పార్టీ కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. అయినా, లెక్కచేయకుండా భాజపాని గెలిపించాలనే ఆలోచనతో వారు పనిచేశారు. సర్‌పై ప్రజలకు భాజపా కార్యకర్తలు అవగాహన కల్పించాలి. తెలంగాణలో సర్‌పై ప్రజలు సంతోషంగా ఉన్నారు. తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారు. ఇక్కడి నుంచి దిల్లీకి డబ్బులు వెళ్తున్నాయి. దిల్లీ దర్బార్‌కు తెలంగాణ ఏటీఎంగా మార్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చింది.. కానీ, ఒక్కటికూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కలిసే ఉన్నాయి. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని నితిన్ నబీన్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ

### సమగ్ర డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

హైదరాబాద్,జూన్ 30 ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధీ పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మర్యాద పూర్వకంగా కలిసారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విద్యలో తీసుకువస్తున్న సంస్కరణలను మిట్టల్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలను పూర్తి గా ప్రక్షాళన చేస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐటీఐలను ఏటీసీ లుగా మారుస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలను అభివృద్ధి చేస్తున్నాం.. చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్ మరియు ఎఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచన చేశారు. హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ , ఎఐకార్యకలాపాలపైన దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందజేస్తామని సునీల్ మిట్టల్ తెలిపారు. ఎయిర్ టెల్ కు రెండో హెడ్ క్వార్టర్ లా హైదరాబాద్ ను చూస్తున్నామని మిట్టల్ అన్నారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి ముందుకు వస్తామని హామీ ఇచ్చారు. ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపైన ఆసక్తి చూపించిన సునీల్ మిట్టల్.

## సాంస్కృతిక క్రీడా వివాదానికి అమెరికా సుప్రీం తెర

పుట్టి ఆ తర్వాత అమ్మాయిలుగా మారిన ట్రాన్స్‌జెండర్లు.. ఇకపై మహిళల క్రీడా విభాగాల్లో పోటీ పడటానికి వీలుండదు. ఈ నిబంధనను కన్జర్వేటివ్ వర్గాలు గట్టిగా సమర్థిస్తున్నాయి. పురుష శారీరక దారుఢ్యం ఉన్నవారు మహిళల విభాగంలో పోటీ పడటం వల్ల అసలైన మహిళా అథ్లెట్లకు అన్యాయం జరుగుతుందన్న వారి వాదనతో కోర్టు ఏకీభవించింది. గత ఏడాది మైనర్లకు ఇచ్చే లింగ మార్పిడి చికిత్సలపై టెన్నెస్సీ రాష్ట్రం విధించిన నిషేధాన్ని కూడా సుప్రీంకోర్టు సమర్థించిన సంగతి తెలిసిందే. తాజాగా వచ్చిన ఈ తీర్పు అమెరికా వ్యాప్తంగా క్రీడా, రాజకీయ రంగాల్లో పెద్ద చర్చకు దారితీసింది. మానవ హక్కుల సంఘాలు ఈ తీర్పును వ్యతిరేకిస్తుండగా, క్రీడల్లో సమానత్వం సాధించడంలో ఇది ఒక పెద్ద విజయమని రిపబ్లికన్ రాష్ట్రాలు కొనియాడుతున్నాయి.

## ఐప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

ఏరోస్పేస్ / డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, 'ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణెళి కొత్త చిరునామా' అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో ౖ÷టైర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు.

'ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి' అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్?16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది' అని పేర్కొన్నారు. స్పెయిన్, కెనడాలకు చెందిన అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు.

ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. ఊష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు.

# సిఎంతో హెచ్‌డిఎఫ్‌సి ప్రతినిధుల భేటీ

- సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు ప్రారంభం

హైదరాబాద్,జూన్ 30 ఎంసీ.ఆర్.హెచ్.ఆర్డీ బోధీ పెవిలియన్ లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, భూపాలపల్లి ఎంఎల్ ఏ గండ్ర సత్యనారాయణ రావు, సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఐతా ప్రకాష్ రెడ్డి ,హెచ్ డీఎఫ్ సి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు అంబులెన్స్ ను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. .వర్చువల్ గా భూపాలపల్లిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మిషన్ ను ప్రారంభించారు. సమావేశం లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలతో లాజిస్టిక్ పార్క్ లు,గోడౌన్ లు,రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వీటి కోసం పెద్దయత్తున రుణాలు మంజూరు చేయాలని,మహిళా సంఘాలు రుణ చెల్లింపులు చాలా బాగున్నాయన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో క్యాంటీన్ సౌకర్యాలు కల్పించాలి: అనుమాస శ్రీనివాస్ జీన్స్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు క్యాంటీన్ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ డివిజనల్ రైల్వే మెంబర్ అనుమాస శ్రీనివాస్ జీన్స్ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ముత్యాల నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనుమాస శ్రీనివాస్ జీన్స్ మాట్లాడుతూ, గతంలో అనేక ప్రధాన రైల్వే స్టేషన్లలో క్యాంటీన్లు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం అవి లేకపోవడంతో ప్రయాణికులు టీ, కాఫీ, అల్పాహారం, భోజనం వంటి ప్రాథమిక సౌకర్యాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులతో ప్రయాణించే కుటుంబాలు ఎక్కువగా అసౌకర్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణకు కూడా మెమోరాండం అందజేసినట్లు తెలిపారు. రైల్వే శాఖతో చర్చించి దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో క్యాంటీన్ సౌకర్యాలను పునరుద్ధరించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టూ టూ ఏ మేనేజర్ అల్లావుద్దీన్ కు ఘనంగా వీడ్కోలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

జిడికే 2&2 ఎ ఇంక్లైన్ నందు యస్.ఓ.యంగా 37 సంవత్సారాలుగా విధులు నిర్వహిస్తూ ఈరోజు పదవి విరమణ పొందుతున్న అల్లాఉద్దీన్ యస్.ఓ.యం వీరిని రామగుండం ఏరియా -1 జియం కార్యలయ నందు ఆర్జీ. 1 జియం లలిత్ కుమార్ అధ్యక్షతన అన్ని విభాగాల ఉన్నతాధికారులు వారికి పూలమాలలు మరియు శాలువాలతో ఘనంగా సన్మానించి వారికి జ్ఞాపికను అందజేసి వారు చేసిన పనులను కొనియాడారు. ఈ సందర్భముగా జియం మాట్లాడుతూ వారు క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారని, పదవి విరమణ అనేది అనివార్యమని, ప్రతి ఒక్కరూ పదవి విరమణ పొందుతారని, వారి శేష జీవితం సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరారు. అనంతరం వారికి సన్నిహితులు, కుటుంబ సభ్యులు వారిని సన్మానించారు.

ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జియం చంద్రశేఖర్, ఎజంట్స్, మేనేజర్లు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ 21వ డివిజన్ లక్ష్మీపురం ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక సర్వే కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని 21వ డివిజన్ కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే తీరును పరిశీలించి, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రజలు ప్రత్యేక సవరణ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలి. అధికారులు ఇంటింటికి వచ్చినప్పుడు అవసరమైన పత్రాలు, వివరాలను అందించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి” అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు బొంతల రాజేష్, గుండేటి రాజేశం, మాధవరావు, బూత్ స్థాయి అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



# అన్ని డివిజన్లో అభివృద్ధికి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేస్తున్నాం...





• మహంకాళి స్వామి

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

నగరంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులకు సంబందించి డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేస్తున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు . వార్డు సందర్శనలో భాగంగా మంగళ వారం 12 వ డివిజన్ విట్టల్ నగర్ లో స్థానిక కార్పొరేటర్ షేక్ బాబూ మియాతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు వార్డు సందర్శనలో భాగంగా సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ తో పాటు రోడ్లు , యు జి డి , కాలువలు అవసరమైన ప్రాంతాల వివరాలు నమోదు చేసుకుంటూ అంచనాలు రూపొందిస్తున్నామని అన్నారు. ప్రాధాన్యత ప్రకారం సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయిస్తామని అన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న విట్టల్ నగర్ డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని అన్నారు. చివరి ఇంటి వరకు అంబులెన్స్ వెళ్ళేలా ప్రతి వీధిలో రోడ్లు నిర్మిస్తామని అన్నారు. చెత్త బయట వేయకుండా మునిసిపల్ సిబ్బంది కి అందించి సహకరించాలని కోరారు. కాలువల్లో , రోడ్ల మీద చెత్త వేస్తే జరిమానాల బారిన పడకతప్పదని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా రోడ్డుకు అడ్డుగా ఉన్న పిచ్చి చెట్లు ,కొమ్మలు తొలగించారు . కాలువల్లో పూడిక తీశారు. ఫైవ్ ఇంక్ లైన్ మోరీ వద్ద ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చుక్కల శ్రీనివాస్ , దొంత శ్రీనివాస్ , నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ , టి పి ఎస్ నవీన్ , సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం , జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి , ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ , సానిటరీ జవాన్ శ్రీనివాస్ ,మెప్మా ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు.





# 46 ఏళ్ల పూర్వ విద్యార్థుల కలయికతో సరికొత్త ఉత్సాహం





• పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

46 సంవత్సరాల క్రితం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అంతా కలుసు కోవడం తో సరికొత్త ఉత్సాహం ఉంటుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ అన్నారు. రామగుండం జడ్పీ హై స్కూల్ లో 1980 కి చెందిన పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం రామగుండం జెన్కో గెస్ట్ హౌస్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ పాల్గొని పూర్వ విద్యార్థుల ఐక్యతను అభినందించారు తాను కూడా రామగుండం జడ్. పి. హెచ్. ఎస్ హైస్కూల్ విద్యార్థినని స్కూల్ పట్ల ఎంతో గౌరవం అభిమానం ఉందని జడ్పీ హైస్కూల్ ఆధునికరణకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా ఆనాటి హైస్కూల్ హెడ్మాస్టర్ కృష్ణమూర్తి విలువలు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం వల్లనే ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఏదిగారని చెప్పారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంకు మాధవి విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. రామగుండంకు చెందిన పూర్వ విద్యార్థి



చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పాల్గొని 46 సంవత్సరాల క్రితం ఇదే హై స్కూల్లో చదివిన విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు ఇక్కడ చదివిన ఆనాటి తోటి విద్యార్థులు ఇతర ఉన్నత చదువులు చదివి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు వ్యాపారాలు చేసుకుని మళ్లీ ఒకసారి కలవడం ఆనందకరంగా ఉందని అన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థిని మాధవి భర్త రిటైర్డ్ ఏసిపి విద్యాసాగర్ మాట్లాడుతూ పాఠశాలల అనేది కేవలం విద్య అందించే స్థలం మాత్రమే కాదని జీవితానికి దిశా నిర్దేశం చేసే ఆలయం అని అన్నారు, కాలం ఎంత మారినా స్నేహబంధం కొనసాగుతుందని అన్నారు ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వివిధ హోదాలో ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగి పదవి విరమణ పొందిన సందర్భంగా ఘనంగా సన్మానించారు, అనంతరం పూర్వ విద్యార్థులంతా ఉత్సాహంగా ఉల్లాసంగా గడుపుతూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు, ఈ కార్యక్రమంలో మాధవి పద్మ సురేఖ సుశీల రాజలింగం రాజేశ్వర్ శ్రీరాములు జబ్బర్ ఖాన్ ఆనంద్ సంఘబట్ల రవీందర్ రవి జక్కం సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ రామగుండం సిఎస్ఆర్ ఆధ్వర్యంలో బ్లీచింగ్ పౌడర్ పంపిణీ



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్ : ఎన్టీపీసీ రామగుండం తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు ప్రభావిత సుమారు 25 గ్రామాలు (పీఏపీలు) మరియు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాలకు సుమారు 500 బస్తాల బ్లీచింగ్ పౌడర్‌ను పంపిణీ చేసింది. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజారోగ్యం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. పంపిణీ చేసిన బ్లీచింగ్ పౌడర్‌ను గ్రామాలు, కాలనీలు, మురుగు కాలువలు, చెత్త నిల్వ ప్రాంతాల్లో క్రిమిసంహారక చర్యల కోసం వినియోగించనున్నారు. దీని ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించి, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు తోడ్పాటు అందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానిక సంస్థలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సమాజ సంక్షేమానికి ఎన్టీపీసీ రామగుండం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ, పరిసర ప్రాంత ప్రజలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన జీవన వాతావరణాన్ని కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.



## సుల్తానాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశం

- హాజరైన ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణ రావు
- పట్టణ అభివృద్ధి పై సూచనలు.



పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్ / జూన్ 30 / అక్షరం న్యూస్.

సుల్తానాబాద్ పురపాలక సంఘం సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో 18 అంశాలపై చర్చించి ఏకగ్రీవముగా ఆమోదించినట్లు కమిషనర్ తెలిపారు.ఈ సంధర్భంగా ప్రభుత్వ విప్ విజయ రమణ రావు పట్టణం లో వర్షాకాలం దృష్ట్యా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించుటకు అధికారులతో పాటు కౌన్సిల్ సభ్యులను, వార్డు సందర్శన కార్యక్రమాలు నిర్వహించి వార్డు సమస్యలను పరిష్కరించాలని సూచించారు పట్టణంలో నూతన కరెంట్ పోల్ ఏర్పాటు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయుటకు విద్యుత్ విభాగం ఏ.ఈ ను ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయుటకు హౌసింగ్ ఏ.ఈ.ల తో పాటు మంచినీటి సరఫరా సక్రమంగా నిర్వహిస్తూ,అమృత్ నిధుల ద్వారా నూతనంగా నిర్మితమవుతున్న వాటర్ ట్యాంక్ ను త్వరితగతిన పూర్తి చేయుటకు స్వశక్తి సంఘం సభ్యులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం కొరకు మిషన్ డైరెక్టర్ మెప్మా హైదరాబాద్ లకు తగిన ప్రతిపాదనలు సమర్పించుటకు ఆదేశించారు. ఈ సమావేశంలో చైర్మన్ బిరుదు రాధా కృష్ణ ,వైస్ చైర్ పర్సన్ శ్రీమతి అంతటి పుష్ప లత , మున్సిపల్ కమిషనర్ రమేష్,కౌన్సిలర్లు శ్రీమతి ఈర్ల స్వరూప, శ్రీ గాజుల రాజ మల్లయ్య, శ్రీమతి కందునూరి సమత, శ్రీమతి గరిగె శోభారాణి శ్రీ బాకం సాయి కిరణ్, శ్రీ వర ప్రదీప్ ఊట్ల, శ్రీ చింతల రాజు, శ్రీ తొర్రి కొండ ప్రభాకర్ , శ్రీమతి కల్వల శంకరమ్మ , శ్రీ సిద్ధ తిరుపతి , శ్రీమతి వేగోళం పద్మ, శ్రీమతి గాదాసు మంజుల గారు, విద్యుత్ విభాగం ఏ.ఈ హౌసింగ్ ఏ.ఈ, ఇరిగేషన్ ఏ.ఈ. మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## కబీర్ కోహినూర్ సమ్మాన్" అందుకున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావు



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 30/ అక్షరం న్యూస్ –:

మందమర్రి, జూన్ 30: మంచిర్యాల జిల్లా కళ్యాణిఖణిలోని సింగరేణి కాలరీస్ పాఠశాలలో సీనియర్ హిందీ పండితులుగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావు ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారం "కబీర్ కోహినూర్ సమ్మాన్" అందుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అఖిల్ భారతీయ కబీర్ మఠం, సద్గురు కబీర్ ఆశ్రమ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 629వ కబీర్ జయంతి మహోత్సవాల్లో భాగంగా ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. జూన్ 28, 29 తేదీల్లో ఘనంగా జరిగిన ఈ వేడుకల్లో హిందీ భాషా, సాహిత్య రంగాలకు విశేష సేవలు అందించినందుకు గాను విద్యాసాగర్ జామి ప్రసాదరావును ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇది ఆయన అందుకున్న ఐదవ జాతీయ స్థాయి పురస్కారం కావడం విశేషం. హిందీ సాహిత్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ "కబీర్ కోహినూర్ సమ్మాన్"తో సత్కరించారు. అదేవిధంగా కబీర్ మహోత్సవ కార్యక్రమంలో విద్యా, సామాజిక అభివృద్ధికి దోహదపడేలా విద్యాసాగర్ జామి ప్రసాదరావు సంపాదకత్వంలో వెలువడిన పలు గ్రంథాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన విద్యావేత్తలు, సాహితీవేత్తలు, కవులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ అవార్డు అందుకోవడం పట్ల విద్యాసాగర్ జామి ప్రసాదరావు ఆనందం వ్యక్తం చేస్తూ, హిందీ భాషా సాహిత్య సేవలో మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

## 38వ డివిజన్‌లో పలు కాలనీల్లో సైన్ బోర్డుల ప్రారంభం




జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 38వ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, హనుమాన్ నగర్, మల్లికార్జున్ నగర్, సీతానగర్, వినోబా నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సైన్ బోర్డులను 38వ డివిజన్ కార్పొరేటర్ నేలకంటి రాము మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ నేలకంటి రాము మాట్లాడుతూ, కాలనీలకు స్పష్టమైన గుర్తింపు కల్పించడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు, అత్యవసర సేవలు వేగంగా చేరేందుకు ఈ సైన్ బోర్డులు దోహదపడతాయని తెలిపారు. ప్రాంతాల గుర్తింపు సులభతరం కావడం వల్ల ప్రజలకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కోట రాజు, పసరగొండ రాంకీ, సాయి, వినయ్, రాజన్నతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# హాట్సాఫ్' ఆఫీసర్స్

- రహదారి భద్రతలో సరికొత్త అధ్యాయం.
- సుల్తానాబాద్ పోలీసుల వినూత్న ప్రయోగం




పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్ / జూన్ 30 / అక్షరం న్యూస్.

రోడ్డు ప్రమాదాల నివారణకు కేవలం జరిమానాలు, చలానాలు మాత్రమే సమాధానం కాదని, ఆలోచన ఉంటే ప్రాణాలు కాపాడే అద్భుతమైన మార్గాలు వెతకొచ్చని నిరూపించారు సుల్తానాబాద్ పోలీసులు. నిత్యం ప్రమాదాలతో రక్తోడుతున్న ప్రధాన రహదారిపై ప్రయాణికులను అప్రమత్తం చేసేందుకు సుల్తానాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. రంజిత్ రావు, సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ ఒక అద్భుతమైన వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. రహదారిపై ఏర్పాటు చేసిన 3డి రేడియం పోలీస్ ఇన్నోవా వాహనాల కటౌట్లు ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే నారాయణపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఒకటి, ఎస్.ఆర్.ఎస్.పి. కెనాల్ కాట్నపల్లి వద్ద మరొక 3డి రేడియం పోలీస్ వాహనం నమూనాను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేశారు. అతివేగంతో వెళ్లే వాహనదారులు దూరం నుంచే ఈ 3డి నమూనాను చూసి, అక్కడ నిజంగానే పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఉండి తనిఖీలు చేస్తున్నారనే భావనతో తక్షణమే తమ వాహనాల వేగాన్ని తగ్గిస్తారు. పగటిపూట మాత్రమే కాకుండా, ప్రమాదాలు ఎక్కువగా జరిగే చీకటి వేళల్లో హెడ్‌లైట్ల వెలుతురు పడగానే ఈ రేడియం వాహనాలు అచ్చం నిజమైన పోలీస్ ఇన్నోవా కార్లలాగే మెరుస్తూ స్పష్టంగా కనిపిస్తాయి. దీంతో డ్రైవర్లు మరింత జాగ్రత్తగా, అప్రమత్తంగా ప్రయాణం చేసే వీలుంటుంది..కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాకుండా, ప్రజల ప్రాణాలను కాపాడాలనే సత్సంకల్పంతో నిరంతరం శ్రమిస్తూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రభావం చూపే ఇలాంటి స్మార్ట్ ఇన్నోవేషన్‌ను తీసుకువచ్చిన సి.ఐ. పి. రంజిత్ రావు, ఎస్.ఐ. చంద్రకుమార్ లపై స్థానిక ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఖరీదైన ప్రయోగాలు కాకుండా, ఇలాంటి వినూత్న ఐడియాలు ఎన్నో ప్రాణాలను నిలబెడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.దీంతో పాటు ప్రజలను అప్రమత్తం చేసేందుకు "అతివేగం వద్దు -- ప్రాణం ముద్దు" అనే పిలుపివ్వడం కూడ ప్రజలను ఆకట్టుకుంటుంది. అధికారులు ఎన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టినా, వాహనదారుల స్వయం నియంత్రణే అన్నిటికన్నా ముఖ్యం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మద్యం సేవించి వాహనాలు నడపరాదని డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్లు ఉపయోగించకూడదని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. సమాజ రక్షణలో సరికొత్త ఆలోచనలతో ముందుకెళ్తున్న సుల్తానాబాద్ పోలీస్ బృందానికి హాట్సాఫ్!

## మూడు దశాబ్దాలపాటు ప్రజాసేవలో

# విశిష్ట సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఘన సన్మానం





- మీ సేవలు పోలీసు శాఖకు చిరస్మరణీయం : అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్‌ఐలు ఠాకూర్ సహదేవ్ సింగ్,మహమ్మద్ అహ్మదుల్లా,మేకల మహేందర్ రెడ్డి, ఏఎస్‌ఐలు బోయ శ్రీనివాస్,మహమ్మద్ అమానుల్లా,ఏఆర్ ఎస్‌ఐ పి. వెంకటేశ్వర్లు,హెడ్ కానిస్టేబుల్ బొట్ల చేరాలులను మంగళవారం అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్ కమిషనరేట్ కార్యాలయంలో పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా పోలీసు శాఖలో క్రమశిక్షణ,నిజాయితీ, అంకితభావంతో సేవలందించిన సహోద్యోగులు ఈ రోజు తమ ఉద్యోగ జీవితానికి వీడ్కోలు పలుకుతున్నారని తెలిపారు.పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రజల భద్రత కోసం వ్యక్తిగత సుఖాలు, కుటుంబ సమయాన్ని సైతం త్యాగం చేస్తూ నిర్వర్తించే గొప్ప బాధ్యత అని అన్నారు.పగలు,రాత్రి అనే తేడా లేకుండా ప్రజల రక్షణ కోసం మీరు అందించిన సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.మీ అనుభవం,క్రమశిక్షణ, సేవాభావం యువ పోలీసు సిబ్బందికి ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.విధి నిర్వహణలో మీరు సంపాదించిన గౌరవం, ప్రజల విశ్వాసం, మంచి పేరు మీ జీవితంలో అత్యంత విలువైన సంపద అని కొనియాడారు.ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి ఆరంభమని పేర్కొన్నారు.ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ,మీ అనుభవాన్ని సమాజానికి మార్గదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్ తరపున ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తూ,వారు చేసిన సేవలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని అన్నారు.



పదవీ విరమణ అనంతర జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్,ఏఆర్ ఏసీపీ రమేష్,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ గోపి, ఆర్‌ఐలు దామోదర్, శేఖర్,పెద్దన్న,రమేష్, సీపీఓ సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, మనోజ్ కుమార్, సందీప్,సంధ్య,సీసీ హరీష్,ఆర్ఎస్‌ఐలు వెంకట్,సరిత,పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జి 2 లో రెండవ రోజు కొనసాగిన

# సింగరేణి అధికారుల నిరాహార దీక్షలు

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సింగరేణి సంస్థలో అధికారులకు తక్షణమే కోల్ ఇండియాలో అమలులో ఉన్న పే అబ్రిడేషన్ విధానాన్ని అమలు చేయాలని, గత మూడు సంవత్సరాలకు సంబంధించిన ప్రొడక్షన్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అలాగే ఇతర పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత బొగ్గు గనుల అధికారుల సంఘం ఆర్‌జీ--2 శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి.ఆర్‌జీ--2 పరిధిలోని అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, యాజమాన్యం వెంటనే స్పందించి అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 13వ తేదీ వరకు







రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని, అప్పటికీ యాజమాన్యం స్పందించకపోతే మరింత తీవ్ర స్థాయి ఉద్యమాలకు వెనుకాడబోమని హెచ్చరించారు.రెండో రోజు నిరాహార దీక్షలో కె. చంద్రశేఖర్ (ఏజీఎం, ఐఈడీ), డాక్టర్ జి. మహిపాల్ (ఎంఎస్, ఆర్‌జీ--2), ఎం.డి. అజీజ్ (ఎస్ఈ, ఈఅండ్ఎం -- స్టోర్స్ ఓసీ--3), డి.పి. కుష్వాహా (అదనపు మేనేజర్, ఓసీ--3), కె. జలపతి (డిప్యూటీ ఎస్ఈ, ఓసీ--3), జె. సుగుణాకర్ (సీనియర్ యూఎం, ఓసీ--3, ఆర్‌జీ--2 ఏరియా శాఖ సంయుక్త కార్యదర్శి), పి. భరత్ (డిప్యూటీ మేనేజర్, వీకేపీ), పి. శ్రావణ్ కుమార్ (సీనియర్ పర్సనల్ ఆఫీసర్, పర్సనల్ విభాగం), ఎస్.కె. ఆసియా బేగం (సీనియర్ యూఎం, వీకేపీ)తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## హోంగార్డుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **హోంగార్డుల సమస్యలు విన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోంగార్డుల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా హోంగార్డులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా, వాటిని శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సేవలో హోంగార్డులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హోంగార్డుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



## ఎన్‌టిపిసి కొత్త సీఎండీ ఎంపికకు జూలై 4న ఇంటర్వ్యూలు

- **పోటీలో పలువురు సీనియర్ అధికారులు.. తుది నిర్ణయం ఏసీసీదే**




జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పాదక సంస్థ ఎన్‌టిపిసి లిమిటెడ్ తదుపరి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ఎంపిక ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ప్రస్తుత సీఎండీ గుర్దీప్ సింగ్ పదవీకాలం 2026 జూలై 31తో ముగియనున్న నేపథ్యంలో, కొత్త సీఎండీని ఎంపిక చేసేందుకు సెర్చ్-కమ్-సెలక్షన్ కమిటీ జూలై 4, 2026న ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. సమాచారం ప్రకారం, ఈ అత్యున్నత పదవి కోసం మొత్తం 18 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ అయ్యారు. వీరిలో ఎన్‌టిపిసి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , గెయిల్ (ఇండియా), పవర్ గ్రిడ్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు ఉన్నారు. అలాగే ఎన్‌టిపిసి సహా పలు సంస్థల ప్రస్తుత డైరెక్టర్లు, ప్రైవేట్ రంగానికి చెందిన ప్రముఖులు కూడా ఈ రేసులో ఉన్నారు. మనకు అందిన సమాచారం ప్రకారం, ఎన్‌టిపిసికి చెందిన పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కూడా ఈ ప్రతిష్టాత్మక పదవి కోసం పోటీలో ఉన్నారు. సంస్థలో దీర్ఘకాల అనుభవం, భారీ విద్యుత్ ప్రాజెక్టుల నిర్వహణ, పునరుత్పాదక ఇంధన రంగంలో పనిచేసిన అనుభవం వంటి అంశాలను కమిటీ ప్రధానంగా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే తుది ఎంపికపై అధికారిక సమాచారం ఇంటర్వ్యూల అనంతరం మాత్రమే వెలువడనుంది. ప్రస్తుత సీఎండీ గుర్దీప్ సింగ్ 2016 నుంచి ఎన్‌టిపిసికి నాయకత్వం వహిస్తున్నారు. గత ఏడాది పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు ఎవరినీ సిఫార్సు చేయకపోవడంతో ఆయనకు ఏడాది పాటు పదవీకాలం పొడిగించారు. దీంతో ఆగస్టు 1, 2026 నుంచి కొత్త సీఎండీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. గతంలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో పీఈఎస్‌బీ ఏ అభ్యర్థినీ ఎంపిక చేయకపోవడంతో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ ఏడాది కొత్తగా దరఖాస్తులు ఆహ్వానించింది. అనంతరం అర్హులైన అభ్యర్థులను గుర్తించే బాధ్యతను సెర్చ్-కమ్-సెలక్షన్ కమిటీకి అప్పగించింది. జూలై 4న జరిగే ఇంటర్వ్యూల అనంతరం ఎస్‌సీఎస్‌సీ తన సిఫార్సులను లిలిక్యాబినెట్ నియామకాల కమిటీ (ూజజ)లిలికి పంపనుంది. తుది ఆమోదం అనంతరం కొత్త సీఎండీ పేరును కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించనుంది. ప్రస్తుతం ఎన్‌టిపిసి థర్మల్ విద్యుత్ ఉత్పత్తితో పాటు పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వంటి భవిష్యత్ ఇంధన రంగాల్లో వేగంగా విస్తరిస్తోంది. దేశంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సంస్థను ముందుకు నడిపించే బాధ్యత కొత్త సీఎండీపై ఉండనుంది.

## ఎన్‌టిపీసీ రామగుండంలో ఘనంగా పదవీ విరమణ

- **పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, అధికారులకు సన్మానం**



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: ఎన్‌టిపీసీ రామగుండంలో జూన్-2026 నెలలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, అధికారులకు మంగళవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులు, ఉద్యోగులు ఉదయం ఏకో పార్కులో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. అనంతరం అడ్మిన్ భవనంలోని జీఎం కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన వారిని శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. వారి సంస్థకు అందించిన సేవలను కొనియాడుతూ అధికారులు అభినందనలు తెలియజేసి, వారి పదవీ విరమణ జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీజీఎం ముకుల్ రాయ్, జీఎం మనీష్ అగర్వాల్, ఏజీఎం హెచ్‌ఆర్ సాగర్ రంజాన్ సాహూ పాటు పలువురు ఉన్నతాధికారులు, విభాగాధిపతులు, సహోద్యోగులు పాల్గొని పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

పదవీ విరమణ పొందినవారు:

ఎస్. సదానందం వల్లకట్ల (మేనేజర్ -- ఫ్యూయల్ హ్యాండ్లింగ్)



జి. రవీందర్ రెడ్డి (ఆపరేషన్ -- ఫ్యూయల్ హ్యాండ్లింగ్)

పి. ఆనందరావు (సబ్ ఇంజినీర్ -- సీ & ఐ మెయింటెనెన్స్)

మొహమ్మద్ సాజిద్ (ఇంజినీర్ -- ఆపరేషన్, ఎస్‌ఎల్‌పీఎస్)

లోల్ల కేశవరావు సోమయాజులు (ఇంజినీర్ -- ఆపరేషన్, ఎస్-ఎల్‌పీఎస్) ఈ కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ బి ఎం ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ఎన్ సాగర్ రాజు, ఐ ఎన్ టి యు సి నాయకులు వేముల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.







## మున్సిపల్ కార్మికుల సమస్యలు తీర్చాలని కమిషనర్ కు వినతి



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 30/ అక్షరం న్యూస్ -:

మందమర్రి మున్సిపల్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులు సి. టి .యూ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కరం కోసం మున్సిపల్ కమీషనర్ తుంగపిండి రాజలింగు ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, సంకె రవి, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా వివిధ విభాగల్లో పని చేస్తున్న కార్మికులకు డా. బి.ఆర్ అంబెడ్కర్ రాజ్యాంగంలో పొందు పర్చిన హక్కులను ప్రభుత్వాలు కార్మికులకు అమలు జరపకపోవడం చూస్తుంటే రాజ్యాంగాన్ని ప్రజా ప్రతినిధులు ఎంత అవమాన పరిచడం జరుగుతుందో అర్థం అవుతుందన్నారు. కోవిడ్ కాలంలో తమ ప్రాణల కన్నా ప్రజల ప్రాణాలు కాపాడడమే బాధ్యతగా పని చేసిన కార్మికులను ప్రభుత్వాలు గౌరవించవలసింది పోయింది,అనేక సంవత్సరాల నుంచి అమలు అవుతున్న మరణించిన, 60 సం. రాలు నిండినవారి స్థానంలో కుటుంబ సభ్యులకిచ్చే ఉద్యోగ హక్కును కూడ నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చెయ్యడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసుకొని గత ఏడాది కాలంలో మరణించిన, 60 సం. రాల వయస్సు నిండివారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసారు. అదే విదంగా కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చెయ్యాలన్నారు. కనీస వేతనం రూ :26000/అమలు చెయ్యాలనీ ప్రతి కార్మికుడికి ఇన్సూరెన్స్ చేయించాలనీ. పెండింగ్ లో ఉన్న బట్టలు, చెప్పులివ్వాలి ప్రభుత్వాన్ని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కోలా వాసు సి.టీ.యూ జిల్లా నాయకులు. అదేవిదంగా మున్సిపల్ సి. టి.యూ నాయకులు చెన్న రాజం, చెన్న రాజ మొగిలి, చిప్పకూర్తి గట్టయ్య, మేడపట్ల నర్సయ్య, అవునూరి లత, వెంకమ్మ, లింగంపల్లి రవి, పొన్న లక్ష్మణ్, సంగి రాజలింగు, అవునూరి మృగరాజు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చెప్పే మాటలకు ఆచరణకు పొంతన లేదు

- **బిబిఎస్. వీరయ్య, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు.**



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సిపిఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేతలు మంగళవారం గోదావరిఖని లోని ప్రభుత్వ హై స్కూల్ ను సందర్శించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య తిథిగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య పాల్గొన్నారు.

బాత్రూం లు, వంట గది, తరగతి గదులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యలు కల్పిస్తున్నామని చెప్తున్న మాటలకూ, ఆచరణకు పొంతన లేదన్నారు.

వర్షం వస్తే రూములు ఉరుస్తున్నాయి, అబ్బాయిలకు బాత్రూములు లేక బయటికి పోవాల్సి వస్తుంది, అమ్మాయిల బాత్రూములకు నీళ్ల ట్యాప్ లు లేవు, కిటికీలకు తలుపులు లేవు, తరగతి గదుల్లోకి కోతులు వచ్చి విద్యార్థులను భయభ్రాంతులకు గురించేస్తున్నాయి, చుట్టూ చెత్త పెరుకపోవడం వల్ల తీవ్ర దుర్గంధం వాసన వస్తుంది,వాటర్ ప్లాంట్ పాడాయిపోవడంతో విద్యార్థులు బాటిల్లతో ఇండ్లలోంచి మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు, బెంచీలు లేవు, ఉన్న కొద్దిపాటి బెంచీలకు డెస్క్ లు లేక తలుపు చెక్కలు పెట్టుకుంటున్న పరిస్థితి ఉన్నది. మధ్యాహ్నం భోజనం వంటగది లో సిమెంట్ బస్తాలు, ఒకవైపు పైపులు వేయడంతో వంట చేయడానికి స్థలం లేని పరిస్థితి ఉన్నది. వంట గది స్టోర్ రూము వలె ఉండడంతో పాములు, తెల్లు, ఎలుకలు వచ్చే పరిస్థితి ఉన్నది. స్కూల్ రికార్డ్స్ భద్రపర్చుకోవడానికి అవసరమైన బీరువాలు లేవు అందులోంచి ఎలుకలు, పందికొక్కులు పోతున్నాయి ఈ పరిస్థితుల్లో పిల్లలు ఎలా చదువుకోవాలో ముఖ్య మంత్రి చెప్పాలి. హైదరాబాద్ లో కూర్చుని కబుర్లు చెప్పడం కాదు క్రింది స్థాయికి వచ్చి చూడాలి. ప్రభుత్వ బడులు ఎందుకు ఇలా ఉన్నాయి వీరంతా నీరు పేదలు, దళితులు, అట్టడుగు వర్గాల కు చెందిన వారు కాబట్టి ఇలా ఉన్నాయి. ఉన్నోళ్లు చదువుకునే దానికి అన్ని సౌకర్యాలు ఇస్తారు. నిరుపేదలకు మాత్రం ఎవరికీ పుట్టిన బిడ్డలు మీరు అని చూస్తారా? రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల బాధ్యత రహితంగా వ్యవహారిస్తుంది. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి, సమస్యలు పరిష్కారం చేయాలని సిపిఎం గా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మల రాజారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి,ఎం. రామాచారి,గోదావరిఖని పట్టణ కార్యదర్శిఏ.మహేశ్వరి, కమిటీ సభ్యులు మెండే శ్రీనివాస్, నాయకులు ఆరెపెల్లి రాజమౌళి, అంబాల రాజ్ కుమార్, సందీప్,రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు దశాబ్దాల సేవలకు ముగింపు

- **ఆర్టీసీ ఉద్యోగి దొనపాటి ప్రభాకర్ రెడ్డి కి ఘన వీడ్కోలు**



కరీంనగర్/చిగురుమామిడి, జూన్ 30 , అక్షరం న్యూస్

కరీంనగర్ పట్టణానికి చెందిన దోన పాటి ప్రభాకర్ రెడ్డి టీఎస్ఆర్టీసీ ఉద్యోగి గా మూడు దశాబ్దాల పాటు వివిధ విశిష్ట సేవలు అందించి మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. కరీంనగర్ డిపో - 2లో ఆర్టీసీ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సహోద్యోగులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యోగంలో చేరిన ప్రభాకర్ రెడ్డి 30 సంవత్సరాల పాటు ఆర్టీసీలో క్రమశిక్షణతో మూడు దశాబ్దాల పాటు సేవలందించారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా విశ్రాంతి జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఆయన భవిష్యత్తులో హాయ్ ఆరోగ్యాలతో,సుఖసంతోషాలతో, జీవించాలని కోరుకుంటూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



## రామగుండంలో ఎన్‌టీపీసీ 176 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు పూర్తి.. నేటి నుంచి 41.6 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: దేశంలో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ లిమిటెడ్ తెలంగాణలోని రామగుండంలో నిర్మిస్తున్న 176 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ (సోలార్ పీవీ) ప్రాజెక్టును పూర్తిగా పూర్తి చేసింది. ఈ ప్రాజెక్టులో చివరి దశకు చెందిన 41.6 మెగావాట్ల సామర్థ్యాన్ని జూన్ 30 నుంచి వాణిజ్య కార్యకలాపాలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రకటించింది. దీంతో 176 మెగావాట్ల సామర్థ్యం గల రామగుండం సోలార్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో కమిషన్ అయి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించింది. ఇంతకుముందు ఈ ప్రాజెక్టులో తొలి దశ 100 మెగావాట్లు మే 2న, రెండో దశ 34.4 మెగావాట్లు మే 29న వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించగా, తాజాగా మిగిలిన 41.6 మెగావాట్లు కూడా అందుబాటులోకి రావడంతో మొత్తం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఈ తాజా సామర్థ్య వృద్ధితో ఎన్‌టీపీసీ గ్రూప్ మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 90,899 మెగావాట్లకు, వాణిజ్య విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 89,819 మెగావాట్లకు పెరిగింది. పునరుత్పాదక ఇంధన రంగంలో తన విస్తరణను మరింత వేగవంతం చేస్తూ, స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఎన్‌టీపీసీ మరో కీలక మైలురాయిని చేరుకుంది. రామగుండం ప్రాంతంలో ఎన్టిపిసి జనరేట్ చేస్తున్న విద్యుత్ పత్తి ప్రస్తుతం 4486 మెగావాట్లకు చేరుకుంది.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నియోజకవర్గం : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రైతు భరోసా నిధులను విడుదల చేస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం బ్రాహ్మణపల్లి గ్రామంలో రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతు భరోసా పథకం ద్వారా ౦ైతులకు వ్యవసాయ పెట్టుబడి భారం తగ్గి, సాగుకు అవసరమైన ఆర్థిక సహాయం అందుతుందన్నారు. రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. వ్యవసాయం లాభదాయకంగా మారేందుకు ప్రభుత్వం అన్ని విధాలా రైతులకు అండగా ఉంటుందని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్





- ధర్మారంలో రూ.25 లక్షల సీసీ రోడ్ల ప్రారంభం..
- అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకూడదు
- భీమదేవరపల్లి మండలంలో 11 వేల తటస్థ ఓటర్లు ఉన్నట్లు వెల్లడి
- ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నాం మంత్రి..

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 30/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ధర్మారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ పురోగతిని సమీక్షించిన ఆయన అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి నిబంధనల ప్రకారం సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతోందని ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను ధృవీకరించుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి అర్హత కలిగిన ఓటరు జాబితాలో ఉండేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణలో సాంకేతిక కారణాల వల్ల పెద్ద సంఖ్యలో ఓటర్లు తటస్థ జాబితాలో ఉన్నారని హుస్నాబాద్ నియోజకవర్గంలో సుమారు 61 వేల మంది. భీమదేవరపల్లి మండలంలో సుమారు 11 వేల మంది తటస్థ ఓటర్లు ఉన్నారని తెలిపారు. రానున్న పది రోజుల పాటు బీఎల్‌వోలకు సహకరించి అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. భీమదేవరపల్లి మండలంలో సుమారు 6 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. ధర్మారం గ్రామానికి రూ.25 లక్షల సీసీ రోడ్లు, ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి రూ.7 లక్షలు మంజూరు చేశామని ప్రధాన రహదారి అభివృద్ధికి కూడా అదనపు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ ఈరోజు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో వివో భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తే ప్రభుత్వం నుంచి అవసరమైన ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, తహశీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ధర్మారం సర్పంచ్ తిరుపతి,మండల నాయకులు, కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, బోజ్జపురి అశోక్ ముఖర్జీ, ఊస కోయిల ప్రకాష్, జక్కుల అనిల్, పిరిశెట్టి కనకయ్య, మంగ రామచంద్రం, మాడుగుల కొమురయ్య, కేతిరి లక్ష్మారెడ్డి, డబ్బా శంకర్, శ్రీనివాసరెడ్డి, పోగుల శ్రీకాంత్, చిట్కుల్ అనీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్నికల సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం





- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరంన్యూస్) జూన్ 30:

అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో సీఎం రిలీఫ్ ఫండ్ కీలక పాత్ర పోషిస్తోందని ఎంపీ పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3,50,000 (మూడు లక్షల యాభై వేల) విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఎంపీ కడియం కావ్య స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడి, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూపేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భరించడం చాలా కష్టసాధ్యమవుతుందని అన్నారు. అలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని చెప్పారు. ముఖ్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందాల్సి వచ్చినప్పుడు లక్షల్లో ఖర్చు అవుతుండటంతో కుటుంబాలు అప్పుల పాలయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, అలాంటి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని ఎంపీ తెలిపారు. అవసరమైన సహాయం కోసం ప్రజలు ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. కష్టకాలంలో తమకు ఆర్థిక చేయూత అందేలా చొరవ చూపిన ఎంపీ కడియం కావ్యకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కోమాళ్ళ గ్రామపంచాయతీ రికార్డుల అదృశ్యంపై సమగ్ర విచారణ చేపట్టాలి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూన్ 30: మండలంలోని కోమల్ల గ్రామ పంచాయతీకి సంబంధించిన 2013-2018 సంవత్సరం వరకు వివిధ రికార్డు బుక్కులు అదృశ్యమైనయని, దానిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి భాద్యులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని మాజీ వార్డు సభ్యుడు కన్నారపు రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్థులతో కలిసి మంగళవారం కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం 2013 నుండి 2018 వరకు గ్రామ సభలో చేసిన తీర్మాణాలకు సంబందించిన రికార్డు బుక్కులు ఏవి అందుబాటులో లేకుండా అదృశ్యం చేశారని గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ వార్డు మెంబర్లు కన్నారపు రాములు, బంద కుమారస్వామి మాట్లాడుతూ ఐదు సం వత్సరాలకు సంబంధించిన గ్రామ పంచాయతీ రికార్డుబుక్కులకు సంబందించిన వివరాలు కావాలని ఆర్టీఐ కింద వివరణ , కోరగా రికార్డు బుక్కులు లేవని పంచాయతీ కార్యదర్శి తెలిపారని అన్నారు. రికార్డులు కనిపించకుండ చేయడం వల్ల ఐదు సంవత్సరాలలో గ్రామ పంచాయతీ నిధులు ఎన్ని దుర్వినియోగమయిన వివరాలు తెలియకుండా పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ రికార్డు బుక్కులను కనిపించకుండా చేసిన వారిపై విచారణ నిర్వహించి భాద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొల్లపల్లి వెంకటస్వామి, బొల్లపల్లి కుమారస్వామి, అనిల్, తాళ్లపల్లి యాదయ్య, శ్రీనివాస్, బొల్లపల్లి కిష్టయ్య, కన్నారపు హారీష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 30 / : హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా గంధమల్ల,బస్వపూర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ లో భూమి కోల్పోయిన రైతులకు త్వరలోనే నిధుల విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు అదేవిధంగా భూములు కోల్పోయిన వారికి కూడా న్యాయం చేస్తామని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో ముఖ్యమైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టి కి తీసుకొని వెళ్లగా ప్రత్యేక మైన నిధులు ఇచ్చి. ఆలేరు నియోజకవర్గన్నీ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపినట్లు బీర్ల అయిలయ్య తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధి, సాగునీటి వసతుల మెరుగుదలతో పాటు ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ భేటీ సానుకూల వాతావరణంలో కొనసాగగా, ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.

## డ్రైనేజీ వ్యవస్థలో సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తా.

**మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్.**



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 30 / : ఆలేరు పట్టణంలో 8 వార్డు పరిధిలోని భరత్ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య గురించి స్థానిక 8వ వార్డు కౌన్సిలర్ బోట్ల సంపత్ మరియు కాలనీవాసులు మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్ దృష్టికి తీసుకురాగా మంగళవారం రోజు భరత్ నగర్ కాలనీలో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థలో సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ పస్తం ఆంజనేయులు ,2వ వార్డు కౌన్సిలర్ మరియమ్మ మార్కు , స్థానిక కాంగ్రెస్ నాయకులు, తాళ్లపల్లి మహేష్, ఏం.డి మునీర్ భరత్ నగర్ కాలనీవాసులు కంతి శంకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రతి జర్నలిస్ట్‌కి అండగా ఉంటాం

- జర్నలిస్ట్ అనిల్ ని పరమార్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేసిన.
- తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్.



యాదాద్రి భువనగిరి జిల్లా / అక్షరం న్యూస్ / యాదగిరిగుట్ట / జూన్ 30 / : మంగళవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిధిలోని రహీంఖాన్ గూడ గ్రామ చెందిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి మంచాల అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు మొహమ్మద్ షానూర్ వారిని పరామర్శించి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి జర్నలిస్ట్ కి తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ తరుపున అండగా ఉంటామని అన్నారు . రోడ్డు ప్రమాదంలో గురైన జర్నలిస్ట్ అనిల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బక్కన్న నర్సింహా,జిల్లా సభ్యులు సంకూరి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు...

# రైతు భరోసా వానాకాలం పెట్టుబడి సహాయం రైతుల ఖాతాల్లో జమ



- అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా పథకం ప్రయోజనాలు పారదర్శకంగా అందిస్తాం: జిల్లా కలెక్టర్ అంకిత్.
- జగన్నాధపురం రైతు వేదికలో రైతులతో కలిసి సీఎం రైతు ఆశీర్వాద సభ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన కలెక్టర్.



భద్రాద్రి కొత్తగూడెం / ములకలపల్లి /జూన్ 30 / అక్షరం న్యూస్ –:

రైతులకు పంట పెట్టుబడి సహాయంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద వానాకాలం--2026 సీజన్‌కు సంబంధించిన నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ నుంచి విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు వేదికలలో రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ములకలపల్లి మండలం జగన్నాధపురం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ అంకిత్ రైతులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రైతు భరోసా పథకం కింద వానాకాలం--2026 సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సహాయాన్ని అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో విజయవంతంగా జమ చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 1,91,340 మంది రైతులకు రూ.337.06 కోట్ల పెట్టుబడి సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,78,828 మంది రైతుల ఖాతాల్లో రూ.318.42 కోట్లను నేరుగా జమ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన అర్హులైన రైతుల ఖాతాల్లో కూడా సాంకేతిక ప్రక్రియ పూర్తికాగానే విడతల వారీగా నిధులు జమ చేయనున్నట్లు తెలిపారు.జూన్ 15 వరకు భూభారతి రికార్డుల్లో నమోదైన =శీఖీ= (అటవీ హక్కుల చట్టం) పట్టాదారుల వివరాలను కూడా రైతు భరోసా పథకంలో పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. భూభారతి లేదా అటవీ హక్కుల చట్టం పట్టాదారులుగా అర్హత ఉండి, సాంకేతిక కారణాల వల్ల ఇంకా పెట్టుబడి సహాయం అందని రైతులు సంబంధిత పత్రాలతో తమ గ్రామ పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. వారి వివరాలను పరిశీలించి జూలై 5, 2026లోపు రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసి అర్హత మేరకు లబ్ధి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతులు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా, సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా పథకం ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు వేదికలలో రైతులు రైతు ఆశీర్వాద సభ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ములకలపల్లి మండలం జగన్నాధపురం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ అంకిత్ రైతులతో మమేకమై రైతు భరోసా పథకం అమలు, పెట్టుబడి సహాయం పంపిణీ, ఎరువుల లభ్యత తదితర అంశాలపై రైతులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో భాగంగా కలెక్టర్ రైతు వేదికలలో విత్తన మేళా లో భాగంగా వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు,సర్పంచ్ కుంజా వినోద్, తహసీల్దార్ స్వాతి బిందు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్,ఏం పి డి ఓ సత్యనారాయణ, ఇతర గ్రామాల సర్పంచ్ లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.









# పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఘన సన్మానం





భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూన్ 30 / అక్షరం న్యూస్ –:

పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 37 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో సేవలందించిన మల్లెంపాటి తిరుమలరావు, పెయ్యాల ప్రసాద్, సాలి పాపయ్య, అలాగే 36 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన మట్టూరి సత్యనారాయణ, కుప్పా వెంకట విశాల్ కుమార్ పదవీ విరమణ పొందారు. వీరికి జిల్లా ఎస్పీ శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులు తమ పోలీసు సేవా అనుభవాలను పంచుకున్నారు. వారి కుటుంబ సభ్యులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు ప్రజలకు అంకితభావంతో సేవలందించిన అధికారులను నూతన పోలీసు సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. వ్యాయామం, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను కొనసాగించాలని సూచించారు. పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్, లాల్ బాబు, కృష్ణారావు, పోలీసు అధికారుల సంఘం సభ్యులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల న్యాయమైన వేతన హక్కులను కాలరాయొద్దు -- 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి

- వేతన ఒప్పందంలో జాప్యం ఇక చెల్లదు -- రేపటి సంయుక్త ధర్నాతో కేంద్రానికి గట్టి హెచ్చరిక.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూన్ 30 / అక్షరం న్యూస్ –:

11వ వేతన ఒప్పందం ఈ నెలతో ముగుస్తున్న నేపథ్యంలో, జూలై 1,2026 నుండి అమలుచేయవాల్సిన నూతన వేతన కమిటీనీ 40 శాతం ఫిట్‌మెంట్ బెనిఫిట్‌తో 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేసి వేతన ఒప్పంద ప్రక్రియను ప్రారంభించాలని కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది, సోమవారం శేషగిరిభవన్‌లో జరిగిన కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, 12వ వేతన ఒప్పంద చర్చలను ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రేపు దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు నిర్వహించనున్న భారీ సంయుక్త ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు, అదే రోజు అన్ని గనులు, విభాగాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు, దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసే ప్రతి ప్రయత్నాన్ని ఐక్య ఉద్యమాలతో తిప్పికొడతామని హెచ్చరించారు, కోట్లాది రూపాయల లాభాలను ఆర్జిస్తున్న బొగ్గు పరిశ్రమలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు న్యాయమైన వేతన ఒప్పందాన్ని అమలు చేయకుండా కాలయాపన చేయడం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు,అదేవిధంగా నాలుగు లేబర్ కోడ్‌లను పూర్తిగా రద్దు చేసి, 12వ వేతన ఒప్పంద ప్రక్రియ ప్రారంభించే వరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకపోతే దేశవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఆందోళనలకు చేపడుతామని హెచ్చరించారు, కార్మికుల ఐక్యశక్తి ముందు కార్మిక వ్యతిరేక విధానాలు నిలవవని తెలిపారు, ఈ సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సెంట్రల్ కార్యదర్శి వంగ వెంకట్, వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు, మల్లికార్జున్ రావు, రమణమూర్తి, క్రిస్టోఫర్, కత్తర్ల రాములు, గట్టయ్య, హుమాయూన్, మాతంగి లింగయ్య, బందారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు,ఐ ఎన్ టీ యు సి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, వైస్ ప్రెసిడెంట్ పీతంబరం, ఆల్బర్ట్, మధుసూదన్, ఏం.శ్రీనివాస్.

సి ఐ టి యు నుండి మంద నర్సింహారావు, విజయగిరి శ్రీనివాస్, వై.వి రావు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ఆహార నాణ్యత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్





భద్రాద్రి కొత్తగూడెం / జూలూరుపాడు / జూన్ 30 / అక్షరం న్యూస్ –:జూలూరుపాడు మండలం జూలూరుపాడు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మరియు కళాశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులను పరిశీలించారు. ఏడో, ఎనిమిదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఔటింగ్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, బాలికలను తల్లిదండ్రులు లేదా అధికారికంగా అనుమతించిన సంరక్షకులతో మాత్రమే బయటకు పంపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం కిచెన్ షెడ్‌ను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులను పరిశీలించారు. అనంతరం కిచెన్ షెడ్‌ను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులను తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. ప్లాంట్ మరమ్మతులు ఆలస్యమవుతున్న కారణాలను అడిగి తెలుసుకుని, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పాఠశాలలో నమోదైన విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా పప్పు పలుచగా ఉండటంతో పాటు నాణ్యత లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం పరిశుభ్రంగా, పోషక విలువలతో, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. తాను మళ్లీ ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఆహార నాణ్యతలో లోపాలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. తాగునీరు, పరిశుభ్రత, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల పెంపుతో పాటు వారి ఆరోగ్యం, సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాలల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్ది విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు మరింత విశ్వాసం కలిగేలా విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, పోషకాహార నాణ్యతను మరింత మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు . ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి,ఎంఈఓ జుంకీలాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# గోధుమవాగు బ్రిడ్జీపై గుంతల మరమ్మత్తులు ముమ్మరం

- నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం సరికాదు.
- యేండ్ల తరబడి బ్రిడ్జీపై దుస్థితి నెలకొంది.
- యుద్ధప్రాతిపదికన మరమ్మత్తు పనులను పూర్తి చేయాలి.
- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్.



భద్రాద్రి కొత్తగూడెం/కొత్తగూడెం / జూన్ 30 / అక్షరం న్యూస్ –: పట్టణపరిధిలోని రామవరం గోధుమవాగు బ్రిడ్జీపై ఏర్పడిన గుంతల మరమ్మత్తులు ముమ్మరంగా సాగుతున్నాయని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కొత్తగూడెం పరిధిలోని రామవరం గోధుమవాగు బ్రిడ్జీపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతోపాటు తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో మున్సిపల్ శాఖ ద్వారా మరమ్మత్తు పనులకు ఆదేశించారు. ఈ మేరకు మేయర్ మూడ్ గణేష్ మంగళవారం అక్కడ జరుగుతున్న మరమ్మత్తు పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జీపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి నిత్యం ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నా నేషనల్ హైవే అధికారులు ఘోరంగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, తమ భాధ్యతను విస్మరించారని అన్నారు. యేండ్ల తరబడి ఈ దుస్థితి నెలకొనడం వల్లే తాము రంగంలోకి దిగాల్సి వచ్చిందని, ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన ఈ మరమ్మతు పనులకు ఆదేశించామని స్పష్టం చేశారు. వాహనదారులకు ఇకపై ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, కూరపాటి సుధాకర్, జి వెంకటేశ్వర్లు, నాయకులు ఎండి యూసుఫ్, ధర్మరాజు, పి సత్యనారాయణాచారి తదితరులు వున్నారు.



# ఉక్కపోత నుంచి చిన్నారులకు ఉపశమనం



పభుత్వ పాఠశాలకు స్టాండ్ ఫ్యాన్ అందజేసిన కౌన్సిలర్ కట్టా సింధుజ.

భద్రాద్రి కొత్తగూడెం/అశ్వారావుపేట / జూన్ 30 / అక్షరం న్యూస్ –: అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కౌన్సిలర్ కట్టా సింధుజ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం స్టాండ్ ఫ్యాన్ అందజేసి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. మండల ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల వినియోగార్థం ఫ్యాన్‌ను అందించారు.

**ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు.**

గత కొంతకాలంగా నెలకొన్న ఉక్కపోత కారణంగా విద్యార్థులు తరగతి గదుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో విద్యార్థులకు ఉపశమనం కలిగేలా ఈ సహాయం అందించారు.

**హెచ్ఎం సూచనతో విరాళం**

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వలపర్ల బాబురావు సూచన మేరకు విద్యార్థుల సౌకర్యార్థం స్టాండ్ ఫ్యాన్‌ను విరాళంగా అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కౌన్సిలర్ కట్టా సింధుజకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు సభ్యులు కట్టా రాంబాబు, కట్టా నీరజ, ఆరేపల్లి దుర్గా నాగేశ్వరరావు, మొర్ల వెంకన్న, రజియా బేగం, ఉపాధ్యాయురాలు కావ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలో డమ్మీ అభ్యర్థితో పరీక్ష రాయించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం / జూన్ 30 అక్షరం న్యూస్ –:

పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అసలు అభ్యర్థికి బదులుగా మరొకరితో పరీక్ష రాయించిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. సాయి మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం, 2019 నవంబర్ 4న నిర్వహించిన పదో తరగతి సోషల్ స్టడీస్ పబ్లిక్ పరీక్ష సందర్భంగా కొత్తగూడెంలోని లిటిల్ బర్డ్స్ పాఠశాలలో నిర్వహించిన తనిఖీల్లో, అసలు అభ్యర్థి తెల్లం అనిల్ స్థానంలో పూనెం సందీప్ పరీక్ష రాస్తున్నట్లు స్క్వాడ్ అధికారులు గుర్తించారు. హాల్ టికెట్‌ను పరిశీలించి అక్రమం జరిగినట్లు నిర్ధారించిన అనంతరం, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కుసుమ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అప్పటి కొత్తగూడెం టౌన్ ఎస్సై పి. రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం సేకరించిన ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు, పత్రాలను పరిశీలించిన కోర్టు నిందితులపై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించింది. దీంతో, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీసెస్ అండ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం, 1997లోని సెక్షన్ 8 కింద మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా, అలాగే సెక్షన్ 419 ఐపీసీ కింద ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. ఈ రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాలని కోర్టు తన తీర్పులో పేర్కొంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నార్సింగ్ అనిల్ కుమార్ వాదనలు వినిపించగా, కోర్టు నోడల్ అధికారి ఎస్సై డి. రాఘవయ్య (కోర్టు డ్యూటీ ఆఫీసర్), డి. కామేశ్వరరావు సమన్వయం అందించారు.

## కిడ్నీ సమస్యలు ఉన్నాయా? అయితే ఈ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాల్సిందే!

మన శరీరంలోని వ్యర్థాలను వడబోసి, రక్తాన్ని శుద్ధి చేయడంలో కిడ్నీలు (మూత్రపిండాలు) కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, కిడ్నీలు బలహీనపడినప్పుడు అవి సోడియం, పొటాషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలను సమర్థవంతంగా బయటకు పంపలేవు. అటువంటి సమయంలో మనం తీసుకునే ఆహారం కిడ్నీలపై అదనపు భారం పడకుండా చూసుకోవాలి. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఏయే ఆహారాలకు దూరంగా ఉండాలో ఇప్పుడు తెలుసుకుందాం.

1. ఉప్పు, సోడియం అధికంగా ఉండే పదార్థాలు: కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు ఉప్పు(సోడియం) వాడకాన్ని తగ్గించాలి. ఆహారంలో ఉప్పు ఎక్కువగా ఉంటే అది రక్తపోటును పెంచి కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. అలాగే, నిల్వ ఉంచిన పచ్చళ్లు, అప్పడాలు, చిప్స్, ప్యాక్ చేసిన స్నాక్స్, జంగ్ ఫుడ్ వంటి వాటికి దూరం ఉంచితే మంచిది. వంటల్లో ఉప్పును సాధ్యమైనంత వరకు తగ్గించుకోవడం మంచిది. 2. పొటాషియం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు: అరటిపండ్లు, నారింజ, కివీ, కర్బూజ వంటి పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. అలాగే, ఎండు ద్రాక్ష, ఖర్జూరం వంటి ఎండిన పండ్లను పరిమితం చేయాలి. బంగాళదుంపలు, చిలకడదుంపలు, టమోటాలు, పాలకూరలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. వీటిని నీళ్లలో ఉడకబెట్టి ఆ నీటిని పారబోసి వండుకోవడం మంచింది. 3. ఫాస్పరస్ అధికంగా ఉండే డైరీ ఉత్పత్తులు: కిడ్నీలు సరిగ్గా పనిచేయనప్పుడు రక్తంలో ఫాస్పరస్ పేరుకుపోతుంది,

# రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాలి

**అశ్వారావుపేటలో ఏఐయుకేఎస్ ధర్నా.**

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / జూన్ 30 / అక్షరం న్యూస్ –: రైతులకు సబ్సిడీ ధరలకే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందజేయాలని, యూరియా పంపిణీలో అమలులో ఉన్న ఆన్‌లైన్ యాప్ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరిగానే సరఫరా చేపట్టాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం అశ్వారావుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.



**రైతులకు సబ్సిడీపై వ్యవసాయ ఇన్‌పుట్లు అందించాలి.**

తొలకరి వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని నాయకులు కోరారు.

**నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి.**

మార్కెట్‌లో విక్రయమవుతున్న నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

యూరియా పంపిణీని పాత విధానంలోనే కొనసాగించాలి.

యూరియా పంపిణీలో అమలవుతున్న ఆన్‌లైన్ యాప్ విధానాన్ని తొలగించి, గతంలో అమలులో ఉన్న విధానంలోనే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే రైతు భరోసా నిధులను సకాలంలో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.



**పోడు భూముల సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి.**

పోడు భూముల సర్వే పూర్తయినప్పటికీ పట్టాదారు పాసుబుక్కులు అందని సాగుదారులకు వెంటనే రీ–సర్వే నిర్వహించి పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ధర్నాలో పలువురు నాయకుల పాల్గొనడం.

ధర్నాకు గొంది లక్ష్మణ్‌రావు అధ్యక్షత వహించగా, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గోకినపల్లి ప్రభాకర్, ఏఐయుకేఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కంగాల కల్లయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కంగాల కన్నయ్య, కారం రాజులు, ధర్మముల రాంబాబు, సున్నం రామారావు, మడకం ముత్యాలరావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, పార్టీ నాయకులు కంగాల భూలక్ష్మి, ధర్ముల శ్రీరాములు, సోడెం పౌల్‌రాజు, తెల్లం సత్యం, సోడెం లక్ష్ముడు, కణితి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ట్రాక్టర్ పరికరాల చోరీ



**తిరుమలకుంట గ్రామంలో ఘటన.. గ్రామస్థుల్లో ఆందోళన.**

భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట / జూన్ 30 / అక్షరం న్యూస్ –: అశ్వారావుపేట మండలంలోని తిరుమలకుంట గ్రామపంచాయతీకి చెందిన స్వరాజ్ ట్రాక్టర్ వెనుక లింకులు, ఇతర పరికరాలను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది.

**చెత్త సేకరణకు వెళ్లగా బయటపడిన చోరీ.**

ఉదయం చెత్త సేకరణ కోసం ట్రాక్టర్‌ను తీసుకెళ్లేందుకు వెళ్లిన పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్‌కు అమర్చిన వెనుక లింకులు, ఇతర పరికరాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే సర్పంచ్ కోర్సా రాజేష్‌కు సమాచారం అందించారు.

**పంచాయతీ ఆస్తులకూ రక్షణ కరువు.**

గ్రామపంచాయతీ ఆస్తులనే లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతుండటంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



**అధికారులకు సమాచారం.**

ఘటనపై సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- ఎఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్.
- సంస్థ అభివృద్ధికి వెన్నెముకగా నిలిచిన అధికారుల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదు.




అధికారుల రెండో రోజు నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించిన ఎఐటీయూసీ నాయకులు.



భద్రాద్రి కొత్తగూడెం/కొత్తగూడెం/జూన్ 30/ అక్షరం న్యూస్ –:

సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం, ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని, వారి న్యాయపోరాటానికి ఎఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏ) ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించిన రెండో రోజు నిరసన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాత్రింబవళ్లు శ్రమిస్తూ సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని వీడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. అధికారుల పే రివిజన్, అలవెన్సులు, పదోన్నతులు, ఇతర పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థ లాభాల్లో అధికారులకు న్యాయమైన వాటా కల్పించడంతో పాటు మెరుగైన వైద్య సదుపాయాలు, సంక్షేమ ప్రయోజనాలు అందించడం యాజమాన్యం బాధ్యత అని పేర్కొన్నారు. అధికారుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సంస్థ అభివృద్ధికే ప్రతికూలమని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని అధికారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శులు వి. మల్లికార్జున్ రావు, రమణమూర్తి, కత్తెర్ల రాములు, జె. గట్టయ్య, హుమాయూన్, కమల్, మధుకృష్ణ, మండల రాజేశ్వరరావు, సీఎంఓఏ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికి గౌరవప్రదంగా వీడ్కోలు సుకన్య టీచర్‌కు ఘన సన్మానం

- పతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమే: మాజీ సర్పంచ్ బి. సోల్ల శ్రీధర్.
- విద్యార్థులకు ఆదర్శ బోధన అందించిన సుకన్య సేవలు చిరస్మరణీయం.



రంగారెడ్డి జిల్లా : శంకర్‌పల్లి: జూన్ 30 :(అక్షరం న్యూస్ )
మున్సిపల్ పరిధిలోని గణేష్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సుదీర్ఘకాలం సేవలందించిన సుకన్య మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. సేవా కాలంలో ఆమె అందించిన విద్యా సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ బి. సోల్ల శ్రీధర్ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ అనేది తప్పనిసరి ఘట్టమని అన్నారు. ఉద్యోగ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి మంచి పేరు సంపాదించుకోవడమే నిజమైన విజయం అని పేర్కొన్నారు. సుకన్య తన విధులను అంకితభావంతో నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మంచి ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారని ప్రశంసించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బి. సోల్ల శ్రీధర్ సుకన్యను శాలువాతో ఘనంగా సత్కరించి పూలబొకే అందజేసి ఆమె సేవలను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సహచరులు సుకన్యతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆమె విద్యార్థుల పట్ల చూపిన ప్రేమ, క్రమశిక్షణ, బోధనా విధానాన్ని ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆమె సమాజానికి తన అనుభవంతో సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాములుతో పాటు ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొని సుకన్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె శేష జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

# విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి: చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్

- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: సాత ప్రవీణ్ కుమార్.
- ప్రభుత్వ పాఠశాలల్లో చేరితేనే నాణ్యమైన విద్య: చైర్‌పర్సన్.
- అయ్యప్పరెడ్డిగూడెం పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కుల పంపిణీ



రంగారెడ్డి జిల్లా : శంకర్‌పల్లి: జూన్ 30 : (అక్షరం న్యూస్ )
విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని అయ్యప్పరెడ్డిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసంపై పలు సూచనలు చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం, ఉచిత ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వ విద్యను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూలకంటి పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థులకు నోటుబుక్కులు అందజేసి వారి విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.

# ఏయే అనారోగ్య సమస్యలు ఉన్నవారు చియా విత్తనాలను తీసుకోకూడదు..

చిన్నగా ఉన్నప్పటికీ చియా గింజలు అనేక పోషకాలను కలిగి ఉంటాయి. ఆరోగ్యకరమైన డైట్‌లో భాగంగా వీటిని తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. వీటిలో ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. చియా గింజల్లో ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియతో పాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

## మింగడంలో ఇబ్బంది ఉంటే..

అయితే చియా గింజలు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ ఇవి అందరికీ సరిపోవు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని జాగ్రత్తగా తీసుకోవాలి లేదా పూర్తిగా నివారించడం మంచిదని వైద్యులు చెబుతున్నారు.

# కొలనూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం




ఓదెల /పెద్దపల్లి జూన్ 29 (అక్షరం న్యూస్ )
ఓదెల మండలశీ లో నీ కొలనూరు ఎస్సీ కాలనీ కమ్యూనిటీ భవనంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్ గౌతం ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారుఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం సోదరి భావం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అదేవిధంగా ఎస్సీ ఎస్టీలకు రెండు గ్లాసుల పద్ధతిని నివారించడం ఎస్సీలను దేవాలయంలోనికి ప్రవేశించడం అదేవిధంగా అంటరానితనం నిర్మూలించడంతోపాటు విందులకు వినోదాల తారతమ్యాలు లేకుండా నిర్వహించుకోవడం కోసం ఇలాంటి సమావేశాలు దోహదపడతాయని అన్నారు చివరి వారం దళితవాడలో సమావేశం నిర్వహించుకోవడం జరుగుతుందని అదేవిధంగా ఎస్సీ ఎస్టి నిధులు సరియైన లబ్ధిదారులకు అందుతున్నా లేదా అనేది తెలుసుకోవడం కోసమే దళితవాడలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని అదేవిధంగా అందరికీ సమానత్వం కలిగించే విధంగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అదేవిధంగా బాల కార్మికుల నియంత్రణ అరికట్టాలని సూచించారు ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తీసుకురావాలని రెవిన్యూ ఇన్స్పెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె కనకయ్య. పోలీసు అధికారి. జి పి ఓ సతీష్ కార్యదర్శి శంకర్ తోపాటు అంబేద్కర్ సంఘం నాయకుల సాతూరి అనిల్ కుమార్ మరియు సాతూరి రాజేశం తోపాటు భారీ ఎత్తున ప్రజలు మహిళలు హాజరయ్యారు

# జిల్లాలోని ప్రతి తండా జిపి లో బంజారా జాతి జెండా ఆవిష్కరణలు ఘనంగా నిర్వహిద్దాం







జనగామ జిల్లా/ రఘునాథపల్లి /( అక్షరం న్యూస్ ) జూన్ 30 : నేడు( బుధవారం)
జూలై 1న లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పి ఎస్) నంగారాభేరి 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లాలోని ప్రతి తండాలో బంజారా జాతి జెండాను ఘనంగా ఆవిష్కరించాలని ఎల్ హెచ్ పి ఎస్ జనగామ జిల్లా ఇన్‌చార్జ్ కొర్ర రాజేందర్ నాయక్ పిలుపునిచ్చారు. బంజారా జాతి ఐక్యత, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణ, హక్కుల సాధనకు ప్రతీకగా ప్రతి తండాలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బంజారా సమాజానికి చెందిన యువత, మహిళలు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయంలని విజ్ఞప్తి చేశారు.

# జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండి సరిగ్గా పనిచేయాలంటే..

- ఈ ఆహారాలను రోజూ తీసుకోవాలి..



ఫైబర్ శరీరానికి చాలా అవసరం. జీర్ణవ్యవస్థకు ఫైబర్ ఒక రాజు వంటిది అని చెప్పవచ్చు. కానీ అన్ని ఫైబర్‌లు ఒకేలా ఉండవు. ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరంతో పాటు అజీర్తి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కనుక కడుపుకు ఇబ్బంది లేకుండా, కడుపు ఉబ్బరం రాకుండా, శరీరానికి స్థిరమైన శక్తిని ఇచ్చే అధిక ఫైబర్ ఉన్న స్నాక్స్ తీసుకోవడం మంచిది అని వైద్యులు చెబుతున్నారు. కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు చాలా మందిలో సాధారణంగా కనిపిస్తాయి. అలాంటి వారు ఈ స్నాక్స్ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అమెరికన్ డైటరీ గైడ్‌లైన్స్ ప్రకారం, రెండు సంవత్సరాల పైబడిన వ్యక్తులు రోజుకు తీసుకునే ప్రతి 1,000 కేలరీలకు సుమారు 14 గ్రాముల ఫైబర్ తీసుకోవాలి. 12 నెలల నుంచి 23 నెలల మధ్య ఉన్న పిల్లలకు రోజుకు 19 గ్రాముల ఫైబర్ ఇవ్వాలి. ఫైబర్ ఆరోగ్యానికి చాలా అవసరం అయినప్పటికీ, అధిక ఫైబర్ ఉన్న ప్రతి ఆహారం సులభంగా జీర్ణం అవ్వాలని లేదు. కనుక తరచూ కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడే వారు జీర్ణ ఆరోగ్యానికి సహాయపడే విత్తనాలు, గింజలు, సంపూర్ణ ధాన్యాలు, పండ్లు తీసుకోవడం మంచిది. ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు కడుపు ఉబ్బరాన్ని తగ్గించి జీర్ణ వ్యవస్థకు మేలు చేసే కొన్ని ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## విత్తనాలు, గింజలు..

గుమ్మడికాయ గింజలు, సబ్జా గింజలు, పొడి చేసిన అవిసె గింజలు, చియా గింజలు వంటి వాటిలో ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు వీటిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. అలాగే కొన్ని రకాల గింజల్లో ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ సులభంగా జీర్ణమవుతాయి. వాల్‌నట్స్, డ్రై రోస్టెడ్ పల్లీలు, మఖానా వంటివి సులభంగా జీర్ణమవ్వడంతో పాటు వీటిలో ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. అలాగే బటర్, నెయ్యి వంటివి వేయకుండా ఎయిర్ పాప్ చేసిన పాప్ కార్న్ వంటి స్నాక్స్ కూడా తీసుకోవచ్చు. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు సులభంగా జీర్ణమవుతాయి. అదే విధంగా స్ప్రౌటెడ్ బ్రెడ్, సవర్డో బ్రెడ్, స్టీల్-కట్ ఓట్స్ వంటి సంపూర్ణ ధాన్యాలతో చేసిన ఆహారాలు కూడా జీర్ణవ్యవస్థకు అనుకూలంగా ఉండడంతో పాటు శరీరానికి ఎక్కువసేపు శక్తిని అందిస్తాయి. టెంపెహ్, ఫర్మ్ లేదా ఎక్స్‌ట్రా-ఫర్మ్ టోఫు వంటి మొక్క ఆధారిత ప్రోటీన్ ఆహారాలు సంతృప్తికరమైనవి. ఇవి తక్కువ ఉబ్బరాన్ని కలిగిస్తాయి. వీటిని ఫైబర్ అధికంగా ఉండే డైట్‌తో కలిపి తింటే కడుపుకు తేలికగా ఉంటుంది.

## పండ్లు, కూరగాయలు..

ఇక పండ్లు, కూరగాయలు సులభంగా జీర్ణం అవ్వడంతో పాటు అధిక ఫైబర్ ను కలిగి ఉంటాయి. ఉడికించిన క్యారెట్, బ్లూబెరీస్, స్ట్రాబెరీస్, రాస్ప్‌బెరీస్, కివీ పండు, ఆరెంజ్, మాండరిన్, కొంచెం పచ్చగా ఉన్న అరటిపండు, బొప్పాయి వంటి ఆహారాలు సులభంగా జీర్ణమవ్వడంతో పాటు కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తాయి. ఇటువంటి ఆహారాల్లో ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు పొట్టకు కూడా తేలికగా ఉంటాయి. కడుపు ఉబ్బరంతో పాటు ఇతర జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడే వారు సులభంగా జీర్ణమవ్వడంతో పాటు ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాలను గట్ ఫ్రెండ్లీ స్నాక్స్ ను ఎంచుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# రాత్రంతా ధనియాలు నానబెట్టి ఉదయాన్నే ఆ నీళ్లు తాగండి..

- ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?



వంటింట్లో ఉండే రకరకాల మసాలా దినుసుల్లో ధనియాలు కూడా ప్రధానమైనవి. దాదాపు అన్ని రకాల వంటకాల్లో ధనియాలను సువాసన కోసం వినియోగిస్తుంటారు. ధనియాల్లోని ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే మన పూర్వీకులు ధనియాలను ఆహారంలో భాగం చేశారు. అయితే ధనియాలను కేవలం వంటల్లో ఉపయోగించడం ద్వారా మాత్రమే కాకుండా.. ఔషధంగా కూడా వినియోగించవచ్చు. ధనియాలను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఆ నీళ్లను ఉదయాన్నే తాగితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయట. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

## ప్రయోజనాలు..

ప్రతిరోజు ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఫ్రీ రాడికల్స్‌కి వ్యతిరేకంగా పోరాడుతాయి. ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తాయి. ఆరోగ్య నిపుణులు తెలిపిన ప్రకారం.. బరువు తగ్గాలనుకునే వారికి ఈ ధనియాల నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. ధనియాల నీటితో జీవక్రియ మెరుగవుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలకు చెక్ పెట్టొచ్చు. తీసుకున్న ఆహారం బాగా జీర్ణమవుతుంది. ధనియాల్లో విటమిన్ కె, విటమిన్ సి, విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడంవల్ల జుట్టు ఆరోగ్యానికి ఎంతో మంచిది. ప్రతి రోజు ధనియాలు నానబెట్టిన నీటిని తీసుకుంటే జుట్టు రాలుడు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. డయాబెటిస్ బాధితులకు కూడా ధనియాల నీరు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉండేవారు ప్రతి రోజూ ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకుంటే షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు లాంటి సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే రోజూ ధనియాల నీటిని తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. కిడ్నీ సమస్యలతో బాధపడే వారికి కూడా ధనియాల నీరు బాగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ సమస్యలు ఉన్నవారు కూడా ధనియాల నీటిని రోజూ పరగడుపున తీసుకోవాలి.

# వేసవి కదా అని కూల్ డ్రింక్స్‌ను అధికంగా తాగుతున్నారా..

- అయితే ఏం జరుగుతుందో తెలుసా..

వేసవి వేడి ప్రజలకు చల్లటి పానీయాలను తాగాలనే కోరిక కలిగిస్తుంది. ముఖ్యంగా తీపి రుచి, గ్యాస్ కలిగిన సాఫ్ట్ డ్రింక్స్ తాగడం ద్వారా వెంటనే దాహం తగ్గినట్లు అనిపిస్తుంది. అందుకే వేసవిలో సాఫ్ట్ డ్రింక్స్ వినియోగం గణనీయంగా పెరుగుతుంది. అయితే వీటిలో ఉండే అధిక చక్కెర, కెఫీన్ వంటి పదార్థాలు అలవాటుగా మారే ప్రమాదం ఉంది. పరిశోధనల ప్రకారం, ఈ పానీయాలను తరచుగా తీసుకోవడం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉండే అధిక ఫ్రక్టోజ్ శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు దారితీస్తుంది. ఇది టైప్-2 డయాబెటిస్‌కు ముందస్తు సంకేతంగా పరిగణించబడుతుంది. అదనంగా, అధిక చక్కెర లివర్‌లో కొవ్వుగా మారి నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్యను కలిగించే అవకాశం ఉంది. దంతాల ఆరోగ్యంపైనా ఇవి ప్రతికూల ప్రభావం చూపుతాయి. సోడాలో ఉండే ఫాస్ఫారిక్, కార్బోనిక్ యాసిడ్లు దంతాల పైపొరను దెబ్బతీసి దంతాలు పుచ్చిపోవడానికి కారణమవుతాయి. అలాగే ఇవి కాల్షియం శోషణను తగ్గించి ఎముకలను బలహీనపరచి ఆస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని పెంచుతాయి.

## అనేక విధాలుగా ప్రభావం..

సాఫ్ట్ డ్రింక్స్‌లో పోషక విలువలు చాలా తక్కువగా ఉంటాయి. ఇవి కేవలం ఎంప్టీ కాలరీలు మాత్రమే ఇస్తాయి. ఫలితంగా, శరీరానికి అవసరమైన పోషకాలు అందకుండా అదనపు కాలరీలు చేరి అస్వస్థకరమైన ఆహార అలవాట్లకు దారితీస్తాయి. అదేవిధంగా, లిక్విడ్ కాలరీలు తృప్తి కలిగించకపోవడంతో మరింత ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. దీని వల్ల బరువు పెరగడం, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. సాఫ్ట్ డ్రింక్స్‌లో కెఫీన్ అధికంగా ఉంటుంది. కెఫీన్ అధికంగా ఉండే సాఫ్ట్ డ్రింక్స్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె వేగం పెరగడం, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా రాత్రి సమయంలో వీటిని తీసుకోవడం నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుందని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో వీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య కూడా రావచ్చు.

కెఫీన్, చక్కెర మూత్ర విసర్జనను పెంచి శరీరంలో నీటి శాతం తగ్గించే అవకాశం ఉంది. ఇక గుండె ఆరోగ్యంపై కూడా వీటి ప్రభావం ఉంటుంది. ప్రతిరోజూ చక్కెర పానీయాలు తీసుకునే మహిళల్లో గుండె జబ్బుల ప్రమాదం దాదాపు 20 శాతం వరకు పెరుగుతుందని ఒక అధ్యయనం చెబుతోంది. రక్తపోటు, ట్రైగ్లిజరైడ్స్ పెరగడం వంటి సమస్యలు కూడా గమనించవచ్చు. అధికంగా సాఫ్ట్ డ్రింక్స్ తీసుకోవడం కిడ్నీలపై ఒత్తిడిని పెంచుతుంది. వీటిలో ఫాస్ఫారిక్ యాసిడ్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీ స్టోన్స్, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. కనుక వేసవిలో సాఫ్ట్ డ్రింక్స్ ను తీసుకోకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



# మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ ?

న్యూఢిల్లీ,జూన్30 ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్




ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

# తెలంగాణపై విషం చిమ్మిన చౌహాన్

**ఎపిని పొగుడుతూ..తెలంగాణపై అక్కసు**

న్యూఢిల్లీ,జూన్30 : తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓ రకంగా విషం కక్కారు. ఇటీవల కేంద్ర మంత్రులు అడపాదడపా విషం కక్కుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి మన రాష్ట్రానికే చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు పెద్దగా పట్టింపు లేదు. ఏదైనా పని కావాలని పట్టుబట్టి చేయించడం లేదు. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖళ మంత్రుల సమావేశంలో శివరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. అంతేగాకుండా ఆంధ్రా మత్రాం భేషుగ్గా పనిచేస్తోందని స్తుతించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో మోడీ సర్కార్ నడుస్తోంది. అందుకే ఈ మధ్య బాబును పొగడం కేంద్రమంత్రులు బాగా అలవాటు చేసుకున్నారు. పనులు గట్టెక్కించుకునే క్రమంలో చంద్రబాబు కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. కానీ మధ్యలో తెలంగాణలో తెగడాల్సిన పనిలేదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం




గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి

చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్దే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. పనిలో పనిగా గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐ నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు. ఇదంతా కేవలం కావాలని చేస్తున్న ప్రకటనగానే చూడాలి. తెలంగాణపై విషం కక్కేందుకు ఎలాంటి అవకాశాన్ని కూడా కేంద్రం వదులుకోవడం లేదు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది పక్కన పెడితే కనీసం అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోతే అది ప్రజలకే నష్టం అన్న జ్ఞానం ఇక్కడ ఉన్న ఇద్దరు మంత్రులకు కలగడం లేదు. బాబును పొగడడం కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఇదే నిదర్శనం.

# వరంగల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా

**బీజేపీ నాయకులకు మంత్రి పొన్నం సవాల్**

సిద్దిపేట,జూన్30 వరంగల్ అభివృద్ధి గురించి మాట్లాడే ముందు బీజేపీ నాయకులు ప్రజలకు నిజాలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ చేశారు. కొత్తగా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నాయకుడు కేవలం తనను తాను నిరూపించుకోవాలనే ఉద్దేశంతో వాస్తవాలు తెలియకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వరంగల్ ఎయిర్‌పోర్టును మంజూరు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానిదే. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇప్పటికే ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఎయిర్‌పోర్టు ప్రక్రియ వేగం పుంజుకుంది. పదేళ్లు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పూర్తి చేయలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా పట్టణాల అభివృద్ధికి మా ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తోంది. హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో సుమారు రూ.5 వేల కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించాం. హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం. స్మార్ట్ సిటీ నిధులపై ఆరోపణలు చేసే బీజేపీ, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలి. నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఎందుకు వచ్చిందో కూడా సమాధానం ఇవ్వాలన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్న తీరు ఆశ్చర్యంగా ఉంది. కార్పొరేషన్‌లో మెజారిటీ లేకుండా మేయర్ అవుతామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. ఎరువుల సరఫరా విషయంలో కూడా బీజేపీ వాస్తవాలను వక్రీకరిస్తోంది. ఎరువులు తయారు చేసి రాష్ట్రాలకు పంపిణీ చేసేది కేంద్ర ప్రభుత్వమే. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వాటిని అందించే బాధ్యతను నిర్వర్తిస్తోంది. తెలంగాణకు రావాల్సిన నిధులు, ఎరువుల విషయంలో కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్లే ప్రతి రూ.10లో తిరిగి కేవలం రూ.3 మాత్రమే వస్తున్నాయి. మిగిలిన నిధుల గురించి కేంద్రం సమాధానం చెప్పాలి. ముఖ్యమంత్రి గారు, మంత్రులు పలుమార్లు ఢిల్లీ వెళ్లినా రాష్ట్రానికి రావాల్సిన నిధులపై స్పందన లేదన్నారు. వరంగల్ అభివృద్ధిపై కేంద్ర మంత్రి బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎవరైనా బహిరంగ చర్చకు రావచ్చు. తెలంగాణకు బీజేపీ చేసిన మేలు ఏమిటో, వరంగల్ అభివృద్ధికి వారు చేసిన కృషి ఏమిటో ప్రజల ముందే చర్చిద్దాం అని మంత్రి అన్నారు.

## అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

- 2మీడియా కథనాలను తోసిపుచ్చిన ఆర్మీ

న్యూఢిల్లీ,జూన్30 చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్‌ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది. ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

## తృణమూల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

- పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై అత్యవసర విచారణకు నో

కోల్‌కతా,జూన్30 తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న టీఎంసీ విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. టీఎంసీ బ్యాంక్ ఖాతాల నిలిపివేత కారణంగా పార్టీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, తక్షణ విచారణ అవసరమని ఆ పార్టీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే ఈ అంశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటూ కోల్‌కతా హైకోర్టు వెంటనే విచారణ చేపట్టేందుకు నిరాకరించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ అమృతా సిన్హా సాధారణ లిస్టింగ్ పక్రియ ప్రకారమే పిటిషన్ విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు బ్యాంక్ ఖాతాలు స్తంభించిపోయాయి. ఖాతాలు ఫ్రీజ్ చేయడం వల్ల ఆ పార్టీ రోజువారీ కార్యకలాపాలు, ఉద్యోగుల చెల్లింపులు, సంస్థాగత వ్యయాలు, రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని టీఎంసీ న్యాయవాదులు వాదించారు. అయితే హైకోర్టు తక్షణ ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించడంతో టీఎంసీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేసు విచారణకు వచ్చే వరకు ఆ పార్టీ నేతలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిలా ఉండగా, కోల్‌కతా హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు రెగ్యులర్ విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ పేలుడు

పేలుడు ధాటికి గోడలు, కిటికీలు ధ్వంసం

పేలుడు మిస్టరీపై పోలీసులు ఆరా

హైదరాబాద్,జూన్30: హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ పేలుడు తీవ్ర కలకలం రేపింది. రోడ్ నంబర్-4లోని ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఇంటి గోడలు, తలుపులు, కిటికీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే ఈ పేలుడు ఎలా జరిగిందనేది మిస్టరీగా మారింది. ఇంట్లోని మూడు గ్యాస్ సిలిండర్లు, ఫ్రిజ్, గీజర్ పేలలేదని తేలింది. అలాగే అగ్నిప్రమాద ఆనవాళ్లు కూడా కనిపించలేదు. ఘటన సమయంలో కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉన్నారు. వీరంతా ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి దేవేందర్ తన భార్య, కుమారుడితో కలిసి గత 24 సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నారు. మంగళవారం ఇంట్లోని వంటింట్లో ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. పేలుడు ధాటికి ఇల్లు తీవ్రంగా దెబ్బతిన్నది. పేలుడు మిస్టరిగా మారింది. ఇంట్లో అగ్ని ప్రమాదం ఆనవాళు కూడా కనిపించలేదు. భారీ శబ్దానికి, ఇంటి ధ్వంసానికి కారణమేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సరూర్‌నగర్ పరిధిలోని బాపూనగర్ రోడ్ నెంబర్-4లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ అతని భార్య, కుమారుడితో కలిసి 24ఏళ్లుగా నివాసముంటున్నారు. అతని ఇంట్లోని కిచెన్‌లో ఈ ఘటన జరిగింది. నిపుణుల సాయంతో ఇల్లు ధ్వంసానికి గల కారణాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. సమాచారం అందుకున్న సరూర్ నగర్ పోలీసులు, హైడ్రా సిబ్బంది అక్కడికి చేరుకొని కారణాలను అన్వేషిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కారును వేగంగా ఢీకొన్న కంటెయినర్

**అదే వేగంతో ముందున్న ట్యాంకర్‌ను ఢీకొన్న కారు**

**రెండు వాహనాల మధ్య నుజ్జునుజ్జు అయిన కారు**

**చిన్నారి సహా ఇద్దరు మృతి**

విజయవాడ,జూన్30 కృష్ణా జిల్లాలోని బీబీగూడెం వద్ద ఉన్న పశ్చిమ బైపాస్ రోడ్డులో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కంటైనర్.. కారును వెనక నుంచి ఢీకొట్టడంతో.. ముందున్న ట్యాంకర్‌ను ఆ కారు బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్, ట్యాంకర్ మధ్యలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి చనిపోవడం తీవ్రంగా కలిచివేసింది. ఇదే ప్రమాదంలో ఎదురుగా వెళ్తున్న బైక్‌ను కూడా ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా దుర్మరణం చెందాడు. ప్రమాదం జరిగిన తీరు చూసి స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కంటైనర్, ట్యాంకర్‌కు మధ్యలో కారు నామరూపాలు లేకుండాపోయింది. మృతదేహాలు కారు లోపలే ఇరుక్కుపోయిన పరిస్థితి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పొక్లెయినర్ సాయంతో కారును బయటకు తీసి.. అందులో నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఈ ప్రమాదంపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆ ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.

# ఆసియా గేమ్స్‌కు భారత మహిళల జట్టు ప్రకటన..

జపాన్ వేదికగా సెప్టెంబర్ 19 నుంచి జరగనున్న ఆసియా గేమ్స్ 2026 కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత మహిళల క్రికెట్ జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. టీ20 ప్రపంచకప్‌లో విఫలమైనప్పటికీ సెలక్టర్లు హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్)లపైనే నమ్మకం ఉంచారు. వికెట్ కీపర్ యస్తికా భాటియాను తప్పించి 17 ఏళ్ల జి. కమిలినికి చోటు కల్పించారు. గత ఎడిషన్‌లో గోల్డ్ మెడల్ గెలిచిన భారత్.. ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది.జపాన్ వేదికగా సెప్టెంబర్‌లో జరిగే ఆసియా గేమ్స్ 2026 కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత మహిళల క్రికెట్ జట్టును బీసీసీఐ మంగళవారం (జూన్ 30, 2026) ప్రకటించింది. ఈ జట్టుకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన కొనసాగనున్నారు. ఇంగ్లాండ్ వేదికగా ప్రస్తుతం జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు లీగ్ స్టేజ్ నుంచే నిష్క్రమించింది. అయినప్పటికీ కెప్టెన్, వైస్ కెప్టెన్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. వారి సారథ్యంలోనే ఆసియా గేమ్స్‌లో భారత మహిళల జట్టు తలపడనుంది. మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో బరిలోకి దిగిన జట్టులోని మిగతా సభ్యుల్లోనూ పెద్దగా మార్పులు చేయలేదు. వికెట్‌కీపర్ బ్యాటర్ యస్తికా భాటియాను ఈ జట్టు నుంచి తప్పించారు. ఆమె ప్లేసులో 17 ఏళ్ల జి. కమిలినిని బీసీసీఐ ఎంపిక చేసింది. ప్రపంచకప్ టోర్నీ సమయంలో గాయపడిన శ్రేయాంక పాటిల్‌కు ఆసియా గేమ్స్ కోసం ఎంపిక చేసిన



జట్టులో చోటు దక్కించుకుంది. అయితే ఆమె అప్పటిలోగా పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే.. ఈ టోర్నీలో పాల్గొంటుంది. కాగా జపాన్ వేదికగా సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు ఆసియా గేమ్స్ జరగనున్నాయి. ఈ టోర్నీలో భారత్.. ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. ఎందుకంటే ఇక క్రితం సారి అంటే 2023లో చైనా వేదికగా జరిగిన ఆసియా గేమ్స్‌లో.. భారత మహిళల జట్టు స్వర్ణం సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఈసారి బరిలోకి దిగుతోంది. పురుషుల విభాగంలోనూ రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని టీమిండియా గోల్డ్ గెలుచుకుంది.

### ఆసియా గేమ్స్‌కు భారత మహిళల జట్టు:

హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా గోష్, జి. కమిలిని, భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, నందిని శర్మ, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్

## ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబో..

### సుబ్రమణ్యస్వామిపై నాగవంశీ వ్యాఖ్యలపై దుమారం

యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ప్రకటించిన సరికొత్త మైథలాజికల్ చిత్రం అప్పుడే సోషల్ మీడియాలో ఒక పెద్ద వివాదానికి కేంద్రబిందువుగా మారింది. సుబ్రహ్మణ్య స్వామి నేపథ్యంతో రాబోతున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ భారీ అంచనాలను పెంచినప్పటికీ, నిర్మాత సూర్యదేవర నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక క్యాప్షన్ తమిళ నెటిజన్లకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. మురుగన్‌ను ఉద్దేశించి ఆయన ఉత్తరాదిన జన్మించి, హృదయభూమిలో రూపుదిద్దుకుని, దక్షిణాదిన పూజలందుకుంటున్నాడు అని పోస్ట్ చేయడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. తమిళ సంస్కృతి, ప్రాచీన సంగం సాహిత్యం ప్రకారం మురుగన్‌ను తమిళుల దేవుడు అని పిలుస్తారు కాబట్టి, ఆయనను



ఉత్తరాదిన జన్మించాడని అనడంపై తమిళ సినీ ప్రియులు తీవ్రంగా మండిపడుతున్నారు. అంతేకాకుండా, అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో తమిళానికి బదులు సంస్కృత శ్లోకాన్ని ఉపయోగించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ సినిమాను బాయ్‌కాట్ చేయాలంటూ ఎక్స్ లో ట్రోల్స్ చేస్తున్నారు. అయితే మరోవైపు, పురాణాల ప్రకారం శివపార్వతుల కుమారుడైన కార్తికేయుడు హిమాలయాల్లో జన్మించాడని, దేవుడిని ఒక ప్రాంతానికే పరిమితం చేయలేమని మరికొందరు నెటిజన్లు నాగవంశీ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. ఈ సున్నితమైన భక్తిరస స్జబెక్ట్‌ను సాంస్కృతిక విలువలకు భంగం కలగకుండా ఎంతో జాగ్రత్తగా తెరకెక్కించాలని పలువురు మేకర్స్‌ను కోరుతుండగా, కేవలం ఒక్క పోస్టర్‌ను చూసి సినిమాను జడ్జ్ చేయవద్దని ఎన్టీఆర్ అభిమానులు మద్దతుగా నిలుస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్ర వివాదంపై హారిక అండ్ హాసిని క్రియేషన్స్ టీమ్ ఇంకా ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వనప్పటికీ, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న క్రేజ్ మరియు అంచనాలు మాత్రం దేశవ్యాప్తంగా రోజురోజుకూ రెట్టింపవుతున్నాయి.

## అజయ్ దేవగణ్ చౌహాన్ సినిమా టీజర్ విడుదల

### చిత్రంలో సంభాషణలపై క్షత్రియుల అభ్యంతరం

బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు నీరజ్ యాదవ్ తెరకెక్కి స్తున్న 'చౌహాన్' సినిమా టీజర్ విడుదలైన కొన్ని రోజుల్లోనే తీవ్ర వివాదంలో చిక్కు కుంది. ఈ సినిమాపై క్షత్రియ పరిషత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ముఖ్యంగా ఈ చిత్ర టీజర్‌లో అజయ్ దేవ్‌గణ్ పలికిన 'పఠానులకు చెప్పండి, చౌహాన్ వస్తున్నాడు' అనే వివాదాస్పద డైలాగ్ సోషల్ మీడియా వేదికగా పెను దుమారాన్ని రేపుతోంది. కాశ్మీర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పెల్లెట్ గన్‌ల వాడకంపై ఉన్న సంభాషణలు, మతపరమైన అంశాలు సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని నెటిజన్లతో



పాటు నటి స్వరా భాస్కర్ వంటి పలువురు ప్రముఖులు సైతం ఇప్పటికే విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే తాజాగా క్షత్రియ పరిషత్ ఈ చిత్రంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను విడుదల చేయడం సినిమా పరిశ్రమలో మరియు రాజకీయ వర్గాలలో తీవ్ర సంచల నంగా మారింది. క్షత్రియ పరిషత్ తమ ప్రకటనలో ఈ చిత్రాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ప్రస్తుత సమాజంలో స్వార్థపూరిత రాజకీయ లబ్ది కోసం, ఓట్ల వేట కోసం చౌహాన్ వంశం పేరును మరియు రాజ్‌పుత్ సమాజ అస్తిత్వాన్ని వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడింది. రాజ్‌పుత్ చరిత్ర అనేది ఎన్నికల ప్రచారాలకు లేదా బాధ్యతారహితమైన మీడియా సంచలనాలకు వాడుకునే రాజకీయ వస్తువు కాదని వారు స్పష్టం చేశారు. చిత్ర నిర్మాతలు కేవలం వివాదాలు సృష్టించి లాభపడాలనే ఉద్దేశంతోనే ఇలాంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్‌పుత్ వారసత్వాన్ని వివాదాలకు ఎరగా వేయకూడదని డిమాండ్ చేశా రు. అయితే ఈ మొత్తం వివాదంపై మరియు క్షత్రియ పరిషత్ లేఖపై చౌహాన్ చిత్ర యూనిట్ కానీ, హీరో అజయ్ దేవ్‌గణ్ కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు.

## నాగబంధంలో అద్భుతమైన పాత్ర నాది

### నటి నభా నటేశ్ ఆసక్తిక విషయాలు వెల్లడి



నేను నటించిన ఓ అరుదైన సినిమా 'నాగబంధం'. ఇందులో పార్వతి అనే వేద విద్యార్థిని పాత్రలో నేను కనిపిస్తా. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా పోరాడే ఆ పాత్ర కథకు కీలకం. ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేసే ఆ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. ఇలాంటి పాత్రలు మళ్లీ మళ్లీ చేయాలనుకున్నా వచ్చేవి కాదు. దర్శకుడు అభిషేక్ నామా ఈ కథ చెప్పిన తీరు, ఆయన విజన్ వినగానే నేను ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నా. ఈ సినిమాని థియేటర్లలో చూసేందుకు ప్రేక్షకుల్లాగే నేనూ ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని నటి నభా నటేశ్ అన్నారు. ప్రేక్షకులు చూసి ఆశ్చర్యపోయేలా, నటిగా నేనెంతో గర్వపడేలా చేసే పాత్రనే 'నాగబంధం'లో చేశానని కథానాయిక నభానటేశ్ తెలిపారు. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె అవకాశాల్ని సొంతం చేసుకుంటూ తెరపై మెరుస్తోంది. ఇటీవల 'నాగబంధం'లో ఓ కథానాయికగా నటించింది. విరాట్‌కర్ణ కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. తాను పోషించిన పార్వతి పాత్ర కోసం సిద్ధం కావడానికి రోజూ రెండు గంటలు సమయం పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకోవల్సి వచ్చేది. నమోరే... పాటతోపాటు మరో జానపద గీతం కూడా చేశా. ఈ రెండు పాటలు విజువల్‌గా చాలా ఘనంగా ఉంటాయి. ఐదువేల మంది డ్యాన్సర్లతో నమోరే.. పాటని తెరకెక్కించిన విధానం, తెరపైన ఆ పాట సాగే విధానం చూసి అందరూ ఆశ్చర్యపోతారు. అలాంటి పాటలో నటించడం ఓ నటిగా నాకూ చాలా కొత్త అనుభవం. ఈ సినిమా కోసం దాదాపు 10 సెట్స్ నిర్మించారు. అనంత పద్మనాభ స్వామి ఆలయ సెట్ నిజమైన ఆలయాన్ని తలపిస్తుంది. అక్కడ చిత్రీకరణ జరిగినన్ని రోజులూ మేమంతా నియమాలతో పనిచేశాం. పూర్తిగా శాకాహారమే తిన్నాం. రోజూ పూజ తర్వాతే అక్కడ చిత్రీకరణ మొదలయ్యేది. ఈ సినిమా నిర్మాణం, ప్రచారం నిర్మాతల అభిరుచికి అద్దం పడుతుందని నభా అన్నారు.

## వివాదంలో చిక్కుకున్న శశాంక్ సింగ్



తమ ఇంట్లో పనిచేసే వంట మనిషిపై భౌతిక దాడికి పాల్పడటం, అసభ్య పదజాలంతో దూషించడం, బలవంతంగా గదిలో బంధించారనే ఆరోపణలపై భోపాల్ పోలీసులు వీరిపై శనివారం (జూన్ 29, 2026) క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో వీరి కుటుంబ డ్రైవర్ మిశ్రాను కూడా సహ నిందితుడిగా చేర్చారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని రాతీబడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ ఘోర ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని రీవా జిల్లాకు చెందిన విపేంద్ర సింగ్ తోమర్ (31) అనే వ్యక్తి పరిచయస్తుల ద్వారా జూన్ 25న భోపాల్‌లోని మెందోరి గ్రామంలో ఉన్న ఈ మాజీ ఐపీఎస్ అధికారి బంగ్లాలో వంట మనిషిగా చేరాడు. నెలకు రూ.15,000 జీతంతో పాటు ఉచిత వసతి, భోజనం ఇస్తామని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా సహాయం చేస్తామని నమ్మించి అతడిని పనిలో పెట్టుకున్నారు. బాధితుడు విపేంద్ర సింగ్ తోమర్ పోలీసులకు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ప్రకారం.. తాను పనిలో చేరిన కొన్ని గంటల్లోనే వండిన ఆహారం నాణ్యత, రుచి బాలేదంటూ శశాంక్ సింగ్ కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశారు. బూతు పురాణంతో వేధించడం ప్రారంభించారు. ఇంట్లోని ఘోరమైన వాతావరణాన్ని చూసి తాను ఉద్యోగం వదిలేసి సొంతూరికి వెళ్ళిపోతానని చెప్పడంతో నిందితులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. బాధితుడు బయటి వ్యక్తులకు సమాచారం అందించకుండా ఉండేందుకు అతని మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నారు. వారి నుంచి తనను తాను రక్షించుకోవడానికి విపేంద్ర ఒక గదిలోకి వెళ్లి తలుపు వేసుకోగా.. క్రికెటర్ శశాంక్ సింగ్, ఆయన ఐపీఎస్ తండ్రి మరియు డ్రైవర్ కలిసి గది తలుపులు బద్దలుకొట్టి లోపలికి దూసుకెళ్లారు. విపేంద్రపై తీవ్రంగా భౌతిక దాడి (బేగరితనం) చేసి, గాయపరిచి బంగ్లా నుండి బయటకు గెంటివేశారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు అతనికి వైద్య పరీక్షలు నిర్వహించారు. విపేంద్ర ముఖం, శరీరంపై స్పష్టమైన గాయాల గుర్తులు ఉన్నట్లు వైద్య నివేదికలో నిర్ధారణ అయింది. ఒకవైపు ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత పంజాబ్ కింగ్స్ ఫినిషర్‌గా శశాంక్ సింగ్ ప్రదర్శనలపై విమర్శలు వస్తున్న తరుణంలో, మైదానం బయట ఇలాంటి సీరియస్ క్రిమినల్ కేసు నమోదు కావడం క్రీడా వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై భోపాల్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్ క్రికెట్ జట్టు మెంటార్‌గా వసీం జాఫర్



హైదరాబాద్ క్రికెట్ జట్టుకు పూర్వ వైభవం తెచ్చేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసి యేషన్ (ఎజూా) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవాళీ క్రికెట్ దిగ్గజం, టీమిండియా మాజీ ఓపెనర్ వసీం జాఫర్‌ను రాబోయే రెండేళ్ల కాలానికి జట్టు మెంటార్‌గా నియమించింది. ఇటీవల 'హెడ్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్'గా బాధ్యతలు చేపట్టిన అంబటి రాయుడు ప్రోద్భలంతోనే జాఫర్ ఈ పదవికి ఎంపికైనట్లు తెలుస్తోంది. రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఉన్న 48 ఏళ్ల జాఫర్ రాకతో హైదరాబాద్ టీమ్‌కు కొత్త బూస్ట్ రానుంది.టీమిండియా మాజీ ఓపెనర్ వసీం జాఫర్ , హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మెంటార్‌గా నియమితులయ్యాడు. భారత దేశవాళీ క్రికెట్‌లో 'రెడ్ బాల్' (ఫస్ట్–క్లాస్) ఫార్మాట్‌లో దిగ్గజంగా పేరుసంపాదించిన జాఫర్.. వచ్చే రెండేళ్ల పాటు హైదరాబాద్ జట్టుకు మార్గనిర్దేశం చేయనున్నాడు. ఇటీవలే అంబటి రాయుడును హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ 'హెడ్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్'గా నియమించింది. తాజాగా అనుభవజ్ఞుడైన జాఫర్‌ను మెంటర్‌గా తీసుకుంది. అయితే.. రాయుడు ప్రోద్భలంతోనే జాఫర్‌ను ఈ పదవికి ఎంపిక చేసినట్టు సమాచారం. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించాడు వసీం జాఫర్. 1996 నుంచి 2020 వరకు సాగిన తన అద్భుతమైన 24 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మైలురాళ్లను అతడు అధిగమించాడు. 260 ఫస్ట్–క్లాస్ మ్యాచ్‌లలో 50.67 సగటుతో 19,410 పరుగులు సాధించాడు. ఇందులో 57 సెంచరీలు, 91 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అలాగే, రంజీ ట్రోఫీ చరిత్రలో 238 ఇన్నింగ్స్‌లలో 12,038 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన రికార్డును కూడా జాఫర్ తన పేరిట లిఖించుకున్నాడు. ఇక 48 ఏళ్ల జాఫర్ భారత్ తరపున 31 టెస్టులు ఆడాడు. ఇందులో 5 సెంచరీలు, 11 హాఫ్ సెంచరీలు సహా.. 1,944 పరుగులు ఉన్నాయి. జాఫర్‌కు కోచింగ్‌లో అనుభవం ఉంది. అతడు పంజాబ్, ఉత్తరాఖండ్, ఒడిశా జట్లకు ప్రధాన కోచ్‌గా పనిచేశాడు. గత సీజన్‌లో విదర్భ జట్టుకు బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా సేవలందించాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609